బుధవారం
02-08-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 42
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

నైగర్‌లో ముదిరిన సంక్షోభం

నైగర్‌లో సంక్షోభం మరింత ముదిరింది. నైగర్‌పై సైనిక జోక్యాన్ని బుర్కినా ఫాసో, మాలీపై యుద్ధాన్ని ప్రకటించడంగా పరిగణిస్తామని ఆ దేశాలు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. తాజా పరిస్థితుల దృష్ట్యా నైగర్‌లోని తమ వారిని ఎయిర్ లిఫ్ట్ చేసేందుకు ఫ్రాన్స్ విదేశాంగ శాఖ చర్యలు చేపట్టింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నైగర్ అధ్యక్షుడు మహమ్మద్ బజౌమ్‌కు వ్యతిరేకంగా సైనిక తిరుగుబాటు జరిగింది.

2 లో

మణిపూర్‌పై చర్చించేందుకు

నేడు ముర్ముతో విపక్షాల భేటీ

న్యూఢిల్లీ: మణిపూర్‌లో హింసపై చర్చించేందుకు తమకు కొంత సమయం ఇవ్వాలని రాష్ట్రపతి ముర్మును ప్రతిపక్షాల తరపున కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కోరారు. ఈ వ్యవహారంలో రాష్ట్రపతి జోక్యాన్ని కోరారు. బీజేపీ పాలిత ఈశాన్య రాష్ట్రంలో హింస కొనసాగుతోందని, అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని ముర్ము దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సానుకూలంగా స్పందించిన రాష్ట్రపతి... బుధవారం విపక్ష నేతలతో భేటీ అయ్యేందుకు అంగీకరించారు. ఉదయం 11.30 గంటలకు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. 'ఇండియా'లోని 21 మంది

- మిగతా 2 లో

పెచ్చరిల్లిన అల్లర్లు

- హరియాణాలో కొనసాగుతున్న ఉద్రిక్తత
- గుర్‌గ్రామ్ మసీదుపై దాడిలో ఇమామ్ మృతి
- హింసాకాండలో ఐదుకి పెరిగిన మృతుల సంఖ్య

2 లో

ఎఫ్ఐఆర్ నమోదుకూ తీరికలేదా?

- అంటే రాజ్యాంగ యంత్రాంగం, శాంతిభద్రతలు కుప్పకూలినట్లేగా!
- మణిపూర్ ప్రభుత్వ, పోలీసు యంత్రాంగానికి సుప్రీం మొట్టికాయలు
- నత్తనడక దర్యాప్తు అలసత్వానికి నిదర్శనమని వ్యాఖ్య
- 7న కోర్టుకు హాజరు కావాలని డీజీపీకి ఆదేశాలు
- ఎఫ్ఐఆర్‌లు-నిందితులు-అరెస్టులపై వివరాలు కోరిన న్యాయస్థానం

న్యూఢిల్లీ: హింస నేపథ్య కేసుల్లో దర్యాప్తు నత్తనడకన సాగుతుండటం, ఇప్పటివరకు అరకొర అరెస్టులు జరగడం, అమానుషాలపై ఎఫ్ఐఆర్ నమోదుకూ తీవ్ర జాప్యం జరగడాన్ని బట్టి ఈశాన్య రాష్ట్రంలో రాజ్యాంగ యంత్రాంగం, శాంతిభద్రతలు పూర్తి స్థాయిలో కుప్పకూలినట్లు స్పష్టమవుతోందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పోలీసు యంత్రాంగం అలసత్వానికి, అధికారుల్లోని బద్ధకానికి కేసుల విచారణ తీరు అద్దంపడుతోందని మొట్టికాయలు వేసింది. ఇప్పటివరకు నమోదైన ఎఫ్ఐఆర్‌లు, నిందితుల సంఖ్య, జరిగిన అరెస్టులు, అరెస్టుల దిశగా చేపట్టే చర్యలు తదితర వివరాలను మణిపూర్ పోలీసుల నుంచి సర్వోన్నత న్యాయస్థానం కోరింది. ఇందుకోసం ఈనెల 7న కోర్టు ఎదుట హాజరు కావాలని మణిపూర్ డీజీపీకి త్రిసభ్య ధర్మాసనం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. మణిపూర్‌లో కుకీ, మయితె వర్గీయుల మధ్య ఘర్షణ, హింస, మహిళలపై దురాగతాలతో రాజ్యాంగబద్ధ యంత్రాంగం పూర్తిగా కుప్పకూలిపోగా, కేసుల విచారణ, చర్యలు తీసుకోవడంలో పోలీసుల వైఫల్యాలపై తమ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని డీజీపీకి ఆదేశాలిచ్చింది. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు కోర్టు

ఎదుట హాజరు కావాలని సీజేఐ చంద్రచూడ్ నేతృత్వ జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఆదేశాలిచ్చింది. ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడం, వారిపై అత్యాచారాలు జరగడం వంటి భయానక ఘటన జరిగిన రోజు నమోదు చేసిన జీరో ఎఫ్ఐఆర్‌తో పాటు సాధారణ ఎఫ్ఐఆర్ వివరాలను కోరింది. ఇప్పటివరకు నమోదైన ఆరువేలకుపైగా ఎఫ్ఐఆర్‌లలో ఎంత మంది నిందితులు ఉన్నారు? వారి అరెస్టుకు

- మిగతా 2 లో

'అవిశ్వాసం'పై

8న చర్చ

10న ప్రధాని సమాధానం

న్యూఢిల్లీ: మణిపూర్‌లో హింసపై చర్చ డిమాండ్ పార్లమెంటును స్తంభింపజేస్తోంది. ఈశాన్య రాష్ట్ర పరిస్థితులపై సమగ్ర చర్చ, ప్రధాని ప్రకటన కోసం ప్రతిపక్షాలు పట్టుపట్టాయి. ఇదే క్రమంలో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. దీనిపై తక్షణమే చర్చ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాయి. దీంతో ఆగస్టు 8 నుంచి 10వ తేదీలోగా అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో చర్చించేందుకు బిజినెస్ సలహా కమిటీ (బీఏసీ) నిర్ణయించింది. కానీ బుధవారమే (ఆగస్టు 2న)

- మిగతా 2 లో

సహకార ఫెడరలిజానికి సమాధి...

- ఎన్నికైన ప్రభుత్వాల హక్కు హరణే ఉద్దేశం
- దిల్లీ బిల్లుపై ప్రతిపక్షాల ఆరోపణలు
- లోక్‌సభలో ప్రతిపాదన
- విపక్షాల అభ్యంతరాలు రాజకీయ ప్రేరేపితం: అమిత్‌షా

న్యూఢిల్లీ: సహకార ఫెడరలిజాన్ని సమాధి చేసేందుకే దిల్లీ బిల్లును కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిందని ప్రతిపక్షాలు దుయ్యబట్టాయి. ఎన్నికైన ప్రభుత్వాల హక్కులను హరించడమే కాకుండా కేంద్రానికి సర్వాధికారాలు కట్టబెట్టడమే దీని ఉద్దేశమన్నాయి. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా జీఎన్‌సీటీడీ (సవరణ) బిల్లును రూపొందించారని, దానిని ఆమోదించే చట్టబద్ధ అర్హత సభకు లేదని, అందుకే తిరస్కరిస్తున్నామని ప్రతిపక్షాలు తేల్చిచెప్పాయి.

దిల్లీలో అధికారుల నియామకాయాధికారాల కోసం తెచ్చిన ఆర్డినెన్స్ స్థానంలో జీఎన్‌సీటీడీ (సవరణ) బిల్లును మంగళవారం లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రవేశపెట్టారు. ప్రతిపక్ష సభ్యుల నినాదాలు, ఆందోళన నడుమ వివాదాస్పద బిల్లును సభ ముందు ఉంచారు. దిల్లీలో సేవలపై కేంద్రానికి అధికారాలు కట్టబెట్టే ఆర్డినెన్స్

స్థానె గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ కేపిటల్ టెరిటరీ ఆఫ్ దిల్లీ (అమెండ్‌మెంట్) బిల్, 2023ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. బిల్లును ప్రవేశపెట్టినప్పుడు సభలో గందరగోళం నెలకొంది. అమిత్‌షా మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీల అభ్యంతరాలు రాజకీయ ప్రేరేపితమేగానీ

- మిగతా 2 లో

రాయలసీమ ద్రోహి జగన్

- రోడ్డుకు మట్టి వేయలేనివాడు మూడు రాజధానులు కడతాడంటా...!
- కర్నూలుకు న్యాయ రాజధాని వచ్చిందా?
- పరదాల మాటు తిరగడం కాదు
- ధైర్యం ఉంటే నందికొట్కూరుకు రా చర్చిద్దాం
- మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

2 లో

విశాఖలో నిరుద్యోగుల భిక్షాటన

అప్పుల్లో ఉన్న ప్రభుత్వానికి భిక్షాటన డబ్బు

2 లో

మన్యంలో వ్యాధుల భయం

- ఆందోళనలో గిరిజన ప్రజానీకం
- పట్టించుకోని అధికారులు
- ముందస్తు చర్యలు కరువు

విశాలాంధ్ర-అరకులోయ/పాడేరు (అల్లూరి జిల్లా): ఎడతెరిపిలేని వర్షాలు... రోజుల తరబడి ముసురుతో అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యం వాసులను వ్యాధుల భయం వెంటాడుతోంది. భారీ వర్షాలను లెక్కచేయకుండా తమ ముఖ్యమైన పనుల నిమిత్తం కుగ్రామాల నుంచి గిరిజనులు మండల కేంద్రాలకు తరలి వస్తున్నారు. ఈ ప్రక్రియలో నిత్యం వర్షానికి తడవడం మధ్యలో ఇబ్బందులు పడడం... పనులు ముగించుకు లేకపోవడం వంటి సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. యథావిధిగా మళ్లీ పనుల కోసం మండల కేంద్రానికి రావడం, వెళ్లడం జరుగుతోంది. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలడం సాధారణమే. అయితే గత 15 రోజులుగా జోరుగా వానలు కురుస్తున్నప్పటికీ అధికారి

- మిగతా 2 లో

నైగర్‌లో ముదిరిన సంక్షోభం

- సైనిక జోక్యాన్ని వ్యతిరేకించిన బుర్కినా ఫాసో, మాలీ
- తమ పౌరుల ఎయిర్ లిఫ్ట్‌కు ఫ్రాన్స్ చర్యలు
- ఈసీఓడబ్ల్యూఏఎస్ ఆర్థిక, వాణిజ్య, ప్రయాణ ఆంక్షలు
- జుంటాకు మద్దతుగా భారీ ర్యాలీ

నియామే: నైగర్‌లో సంక్షోభం మరింత ముదిరింది. నైగర్‌పై సైనిక జోక్యాన్ని బుర్కినా ఫాసో, మాలీపై యుద్ధాన్ని ప్రకటించడంగా పరిగణిస్తామని ఆ దేశాలు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. తాజా పరిస్థితుల దృష్ట్యా నైగర్‌లోని తమ వారిని ఎయిర్ లిఫ్ట్ చేసేందుకు ఫ్రాన్స్ విదేశాంగ శాఖ చర్యలు చేపట్టింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నైగర్ అధ్యక్షుడు మహమ్మద్ బజౌమ్‌కు వ్యతిరేకంగా సైనిక తిరుగుబాటు జరిగింది. దీంతో ప్రయాణ, ఆర్థిక ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. తిరనడానికి తిండి లేక, అద్దె కట్టేందుకు డబ్బు లేక నైగర్ జనాభాలో చాలా మంది తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న గుడారాల్లో జీవిస్తుంటారు. తాజా పరిస్థితులతో వారి జీవితాలు మరింత దుర్భరమ య్యాయి. పశ్చిమ ఆఫ్రికా ప్రాదేశిక సంఘం 'ఈసీఓడబ్ల్యూఏఎస్' ఆంక్షలు విధించడమే కాకుండా వారంలోగా బజౌమ్‌లో పూర్వ పరిస్థితులను నెలకొల్పాలని తిరుగుబాటు నేతలకు హెచ్చరిక చేసింది. లేని పక్షంలో తీవ్ర పరిణామాలు తప్పబోవని కూడా తేల్చిచెప్పింది. నైగర్‌తో పాటు ఇతర సభ్య దేశాల మధ్య వాణిజ్య ఆర్థిక లావాదేవీలను ఈసీఓడబ్ల్యూఏఎస్ నిలువరించింది. ప్రాంతీయ కేంద్ర బ్యాంకుల్లోని నైజీరియన్ ఆస్తులను ఫ్రీజ్ చేసింది. విదేశీ సాయంపై ఎక్కువగా ఆధారపడే నైగర్ తాజా ఆంక్షలతో స్తంభించిపోయింది. సుమారు 25 మిలియన్లకుపైగా ప్రజల దుస్థితికి దారితీసింది. అయితే తిరుగుబాటు నేతలకు నైగర్ ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. 'రష్యా వర్ధిల్లాలి, డౌన్ ఫ్రాన్స్' అన్న నినాదాలు మార్మోగాయి. ఆదివారం రాజధానిలోని ఫ్రాన్స్ రాయబార కార్యాలయాన్ని నిరసనకారులు ధ్వంసం చేశారు. ఈసీఓడబ్ల్యూఏఎస్ నిర్ణయాన్ని ముందే గ్రహించిన నైగర్‌లోని జుంటాకు మద్దతుదారులు వేలాది మంది రాజధాని నియామేలో భారీ ప్రదర్శన నిర్వహించారు. రష్యా జెండాలు ప్రదర్శిస్తూ ఫ్రాన్స్‌ను దుయ్యబట్టారు. 'డౌన్ విత్ ఫ్రాన్స్', 'లాంగ్ లివ్ పుతిన్' ప్లకార్డులు ప్రదర్శించారు.రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ అంతర్జాతీయ సమాజాన్ని దూరంగా ఉండాలని సూచించారు. ఘర్షణాత్మక పరిస్థితుల్లో తమ పౌరులను ఎయిర్‌లిఫ్ట్ చేసేందుకు ఫ్రాన్స్ ప్రభుత్వం మంగళవారం చర్యలు ప్రక్రియను చేపట్టింది. అత్యవసరమైనవి, ఆహారం, తాగునీరు, ఫోన్లు, బ్యాటరీలతో కూడిన చిన్న బ్యాగు సర్దుకోమని బయల్దేరమని తమ వారికి సూచించింది. ఫ్రెంచ్ పౌరుల భార్యాపిల్లలు కూడా ఎయిర్‌లిఫ్ట్‌కు అర్హులేనని ఈమెయిల్ ద్వారా స్పష్టం చేసింది. ఈ పరిస్థితుల్లో ఫ్రాన్స్ ప్రజలను అక్కడ నుంచి ఖాళీ చేయించడమే ప్రత్యామ్నాయమని పేర్కొంది. మరోవైపు బాలీ, బుర్కినా ఫాసోలోని సైనిక ప్రభుత్వాలు సంయుక్త ప్రకటనలో నైగర్‌కు వ్యతిరేకంగా సైనిక జోక్యాన్ని తమ దేశాలపై యుద్ధం ప్రకటించినట్లు పరిగణిస్తామని తేల్చిచెప్పాయి. మాలీ, బుర్కినాఫాసోలో 2020 నుంచి రెండుసార్లు తిరుగుబాట్లు జరిగాయి. ప్రభుత్వాలను కూల్చి సైనికులు ఆధిపత్యాన్ని ప్రకటించాయి. ఇస్లామిక్ స్టేట్, అల్ ఖైదాతో ముడిపడ్డ హింసను సమర్థంగా కట్టడి చేయగలమని చెప్తూఖున్నాయి. అయితే ఈసీఓడబ్ల్యూఏఎస్ ఆ రెండు దేశాలపై ఆంక్షలు విధించింది. బ్లాక్ నుంచి సస్పెండ్ చేసింది. ఎన్నడూ కూడా బలవంతపు చర్యలు తీసుకోవద్దని హెచ్చరించింది. 2021 నుంచి సైనిక పాలనలో ఉన్న గునియా దేశం కోసం నైగర్‌లో జుంటాకు మద్దతు ప్రకటించింది. 'స్పృహలోకి రావాలి' అంటూ ఈసీఓడబ్ల్యూఏఎస్‌కు సూచించింది. ఈ సంఘం ఆంక్షలే ప్రస్తుత సంక్షోభానికి కారణమని పేర్కొంది.

తిరుగుబాటుదారులకు అనుకూలంగా ఫ్రాన్స్‌కు వ్యతిరేకంగా నైగర్‌లో భారీ ప్రదర్శన

బ్రిక్స్‌లో చేరాలని ఉంది: బొలీవియా

బ్యూనస్ ఎయిర్స్: బ్రిక్స్‌లో చేరాలని బొలీవియా కోరుకుంటున్నట్లు ఆ దేశ విదేశాంగ మంత్రి రోగిలియో మేతా ప్రకటించారు. ఆగస్టు 22-24 తేదీల్లో జొహనెస్‌బర్గ్‌లో జరగబోయే దక్షిణాఫ్రికా సదస్సులో పాల్గొనున్నట్లు వెల్లడించాయి. 'జొహనెస్‌బర్గ్‌లో జరిగే బ్రిక్స్ సదుస్సులో బొలీవియా పాల్గొనుంది. తమ దేశ ఆర్థిక, సామాజిక, పారిశ్రామిక అభివృద్ధి నమూనాను మా అధ్యక్షుడు వివరిస్తారు' అని ట్విట్టర్ మాధ్యమంగా మేతా వెల్లడించారు. బ్రిక్స్‌లో భాగం కావాలని బొలీవియా కోరుకుంటున్నట్లు జూన్ 12న అధ్యక్షుడు లూయిస్ అల్బర్టో ఆర్కె అధికారికంగా ప్రకటన చేసినట్లు పేర్కొన్నారు.

ఐదు కేసుల్లో సూకీకి ఊరట

యాంగోన్: మైన్మార్ నాయకురాలు ఆంగ్ సాన్ సూకీకి ఐదు క్రిమినల్ కేసులో ఊరట లభించింది. ఆమెపై ఇంకా 14 కేసులు ఉన్నాయి. బుద్ధిస్ట్ లెంట్ సందర్భంగా ఏడు వేల మందికిపైగా ఖైదీలకు క్షమాభిక్ష లభించింది. ఇందులో భాగంగానే సూకీని సైనిక జుంటా ఐదు కేసుల్లో క్షమించినట్లు మంగళవారం స్థానిక మీడియా పేర్కొంది. ఆంగ్ సాన్ సూకీని స్టేట్ అడ్మినిస్ట్రేటివ్ కౌన్సిల్ చైర్మన్ క్షమించారని వార్తానివేదిక తెలిపింది. 2021లో సైనిక తిరుగుబాటు జరిగిన క్రమంలో సూకీ ప్రభుత్వం కూలిపోగా అప్పటినుంచి ఆమె నిర్బంధంలో ఉన్నారు. అవినీతి, అక్రమంగా వాకీటాకీలు కలిగివుండటం, కోవిడ్ ఆంక్షలను అతిక్రమించడం వంటి ఆరోపణలపై కేసులు నమోదు కాగా ఆమెకు 33ఏళ్ల జైలుశిక్ష పడింది. తాజాగా ఐదు కేసుల్లో క్షమాభిక్ష లభించగా సూకీపై మరో 14 కేసులు నడుస్తున్నాయి. కాబట్టి ఆమెకు పూర్తిగా ఊరట లభించలేదని న్యాయ వర్గాలు పేర్కొన్నాయి.

మన్యంలో వ్యాధుల భయం

(మొదటిపేజీ తరువాయి)

యంత్రాంగం మాత్రం ఎటువంటి పారిశుధ్య చర్యలు చేపట్టడంలేదు. ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకొని వ్యాధులు ప్రబలకుండా గిరిప్రాంత ప్రజలను అప్రమత్తం చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. కానీ అటువంటి కార్యక్రమాలు కాన రాకపోవడంపై గిరిజన ప్రాంత ప్రజలు, గిరిజన సంఘాల నేతలు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు మండిపడుతున్నారు. గతంలో సీజన్ ప్రారంభం కాకముందే గ్రామాల్లో వైద్య ఆరోగ్య సదస్సులు, వైద్య శిబిరాలు ముందస్తుగా నిర్వహించడం, కరపత్రాల ద్వారా గిరిజనులను చైతన్యవంతం చేసేవారు. మరగబెట్టిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షంలో తడవరాదని ఇలా అనేక జాగ్రత్తలను తెలుపుతూ అవగాహనతో కూడిన కార్యక్ర మాలు చేపట్టేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఎక్కడ అవగాహన కార్యక్ర మాలు చైతన్య సదస్సులు కనిపించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో చాప కింద నీరుల జ్వరాలు విస్తరిస్తు న్నాయి. అవి ఎటువంటి జ్వరాలో తెలియక గిరిజనులు అయోమ యానికి గురి అవుతూ వైద్య సాయం కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలోని కొన్ని మండలాల్లో ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవలందడం లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత, ఏరియా ఆసుపత్రిలో వైద్యాధి కారుల కొరత ఉండడంతో చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు కూడా గిరి ప్రజలు ఇబ్బందులు పడక తప్పడం లేదు. దీంతో మెరుగైన చికిత్స కోసం ఎస్.కోట,విజయనగరం, విశాఖ పట్టణం వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. పేద ప్రజానీకం మాత్రం విశాఖ, విజయనగరం వంటి ప్రాంతాలకు వెళ్లే స్థోమత లేక రోగాన్ని ముదరబెట్టుకుంటూ ప్రాణంమీదకు తెచ్చుకుంటున్నారు. గత 15 రోజులుగా వర్షాలు కురుస్తున్నా వైద్య ఆరోగ్యశాఖ ఏమాత్రం స్పందించకపోవడం, అధికార యంత్రాంగం కూడా మౌనంగా ఉండి పోవడంపై ప్రజాసంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్త జిల్లా రావడంతో ఇక మంచి రోజులు వచ్చాయని, అరకులోయ అభివృద్ధి ప్రగతి పథంలో ప్రయా ణిస్తుందని అందరూ ఎదురు చూశారు. అయితే అందుకు విరుద్ధంగా జిల్లా ఏర్పడి ఇన్ని నెలలు కావస్తున్నా.. పాత సమస్యలు అట్లనే ఉండ టంతో జిల్లా వచ్చి ప్రయోజనం ఏంటని గిరిజనం ప్రశ్నిస్తున్నారు. గిరిజన గ్రామాల్లో వ్యాధులు విజృంభించక ముందే, మరో మరణ మృదంగం మోగకముందే అధికారులు అప్రమత్తమై తగిన చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ఉందని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, గిరిజన సంఘాల నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. పంచాయతీ కేంద్రాల్లో ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించాలని, పరిసరాలు పరిశు భ్రంగా ఉండేలా పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పెచ్చరిల్లిన అల్లర్లు

గురుగ్రామ్/చండీగఢ్: హరియాణాలో రెండు వర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలు మరింత పెచ్చరిల్లాయి. నుహ్ జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. కర్ఫ్యూను కూడా లెక్క చేయకుండా రెండు వర్గాల వారు రోడ్ల మీదకు వచ్చి పరస్పరం దాడులకు పాల్పడుతున్నారు. ఇతరుల ఆస్తులకు నష్టం కలిగిస్తున్నారు. తాజాగా అల్లర్ల ప్రభావం పక్కనున్న గురుగ్రామ్ జిల్లా పైనా పడింది. కొన్ని అల్లరి మూకలు వివాదాస్పద నినాదాలు చేస్తూ బాద్‌షాపూర్‌లోని ఒక రెస్టారెంట్‌తో పాటు దుకాణానికి నిప్పు అంటించారు. ఈ ఘటన సోమవారం రాత్రి నుహ్ జిల్లాలో అల్లర్లు చోటుచేసుకున్న ప్రాంతానికి కేవలం 40 కి.మీ. దూరంలో ఉంది. గురుగ్రామ్‌లోని ఒక మసీదుపై గుంపు దాడి చేసి దాని ఇమామ్‌ను హత్య చేసింది. దీంతో నుహ్ జిల్లాలో విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఊరేగింపును ఆపే ప్రయత్నంపై చెలరేగిన హింసలో సంఖ్య ఐదుకు చేరుకుందని పోలీసులు మంగళవారం తెలిపారు. సోమవారం రాత్రి జరిగిన ఘర్షణల కారణంగా ఇప్పటి వరకు నలుగురు మృతి చెందగా, దాదాపు 45 మందికి గాయాలయ్యాయి. మృతుల్లో ఇద్దరు హోం గార్డులు కూడా ఉన్నారు. నుహ్ జిల్లా వ్యాప్తంగా కర్ఫ్యూ విధించినట్లు రాష్ట్రం హోం శాఖ మంత్రి అనిల్ విజ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు 20 కేసులు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. బాధ్యులను గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నామన్నారు. బాద్‌షాపూర్‌లో ఘటన గురించి తెలిసిన వెంటనే పోలీసు బలగాలు అక్కడికి చేరుకొని పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. గురుగ్రామ్‌లోని సెక్టార్ 57 ప్రాంతంలో 26 ఏళ్ల ఇమామ్ హత్యకు గురయ్యాడు. పొరుగున ఉన్న నుహ్ నుంచి హింస వ్యాపించడంతో మసీదుకు నిప్పు పెట్టినట్లు పోలీసులు తెలిపారు. గుంపు కాల్పులు జరపడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. బీహార్‌కు చెందిన సాద్‌గా గుర్తించిన ఇమామ్ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఉన్నతాధికారి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అర్ధరాత్రి దాటిన తర్వాత గుంపు సెక్టార్ 57లోని అంజుమన్ మసీదు వద్దకు చేరుకుంది. అందులో కొందరు వ్యక్తులు మసీదులో ఉన్న వారిపై కాల్పులు జరిపి, దానికి నిప్పు పెట్టారు. నుహ్‌లో సోమవారం జరిగిన హింసలో గాయపడిన మరో ఇద్దరు వ్యక్తులు వారి గాయాలతో మరణించారు. బాధితులు హోం గార్డులు నీరజ్, గుర్సేవక్, భాదాస్ గ్రామ నివాసి శక్తి. నాలుగో వ్యక్తి ఎవరనేది ఇంకా తెలియాల్సి ఉంది. నుహ్‌లో జరిగిన హింసాకాండలో పది మంది పోలీసులు సహా 23 మంది గాయపడ్డారు. అల్లర్లకు సంబంధించి జిల్లాలో 11 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసిన పోలీసులు 27 మందిని అదుపులోకి తీసుకున్నారు. కనీసం 120 వాహనాలు ధ్వంసమయ్యాయి. వీటిలో పోలీసులకు చెందిన వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిల్ విజ్ పీటీఐతో మాట్లాడుతూ 'ఎవరో దీనికి (హింస) సూత్రధారిగా ఉన్నారు. కానీ నేను ఎటువంటి నిర్ధారణలకు చేరుకోవాలనుకోలేదు. మేము దీనిపై దర్యాప్తు చేస్తాము. బాధ్యులైన ప్రతి ఒక్కరినీ న్యాయస్థానం ముందు ఉంచుతాము' అని తెలిపారు. ముస్లింలు అధికంగా ఉండే నుహ్‌లో హింసాత్మక వార్త సోమవారం వ్యాపించడంతో సోహ్నాలోని గుంపులు ఆ వర్గానికి చెందిన వ్యక్తులకు చెందిన నాలుగు వాహనాలు, దుకాణాన్ని తగలబెట్టాయి. నుహ్, సోహ్నాలో పరిస్థితి ఉద్రిక్తంగా కొనసాగుతోంది. అయితే, మంగళవారం ఎలాంటి తాజా హింసాత్మక ఘటనలు చోటుచేసుకోలేదు. నుహ్, ఇతర ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు, పారామిలటరీ బలగాలు పెద్ద సంఖ్యలో మోహరించినట్లు పోలీసులు తెలిపారు. నుహ్‌లో పరిస్థితి అదుపులోనే ఉందని అధికారులు తెలిపారు. ఇప్పటికే 13 కంపెనీల కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకోగా, మరో ఆరు కంపెనీల బృందాలు త్వరలో చేరుకోనున్నాయి. నుహ్‌లో పోలీసులు కవాతులు నిర్వహించింది. ఈ సందర్భంగా శాంతిభద్రతలను కాపాడాలని జిల్లా యంత్రాంగం ప్రజలకు విజ్ఞప్తి చేసినట్లు ఒక ప్రకటన పేర్కొంది. బుధవారం వరకు నుహ్, ఫరీదాబాద్‌లలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. ముందుజాగ్రత్త చర్యగా గురుగ్రామ్, ఫరీదాబాద్, పల్వాల్ జిల్లాల్లో మంగళవారం విద్యా సంస్థలను మూసివేయాలని ఆదేశించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హరియాణా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ సోమవారం తెలిపారు. 'నేటి ఘటన దురదృష్టకరం. రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలని ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. దోషులను ఎట్టిపరిస్థితుల్లోనూ విడిచిపెట్టబోము, వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము' అని ముఖ్యమంత్రి హిందీలో ట్వీట్ చేశారు.

నుహ్, సోహ్నాలో శాంతి కమిటీల సమావేశాలు

రెండు పట్టణాల్లో మతపరమైన హింసాకాండ నేపథ్యంలో మంగళవారం నుహ్, సోహ్నాలో శాంతి కమిటీ సమావేశాలు జరిగాయి. నుహ్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంత్ పవార్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సరేంద్ర సింగ్ బిజార్నియా అధ్యక్షత వహించిన శాంతి చర్చలలో ప్రజలు హింసను పెంచడానికి అనుమతించబోమని, శాంతిభద్రతల పరిరక్షణలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. నిందితులను గుర్తించేందుకు సహకరించాలని బిజార్నియా శాంతి కమిటీ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. నుహ్ హింస, గురుగ్రామ్ మసీదుపై దాడి తరువాత అన్ని మతపరమైన ప్రదేశాలలో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు పోలీసులు తెలిపారు. సోహ్నాలో గురుగ్రామ్ డీసీ నిశాంత్ కుమార్ యాదవ్... శాంతి కమిటీ సమావేశానికి హాజరైన వారు పట్టణంలో సామాజిక సామరస్యాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. వదంతులను పట్టించుకోవద్దని, సామరస్యానికి భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీసీ తెలిపారు. డీసీపీ (హెడ్ క్వార్టర్స్) దీపక్ గెహ్లావత్, డీసీపీ (సౌత్) సిద్ధాంత్ జైన్, సోహ్నా ఎస్‌డీఎం ప్రదీప్ సింగ్, సోహ్నా ఎమ్మెల్యే సంజయ్ సింగ్, మాజీ ఎమ్మెల్యే తేజ్‌పాల్ తన్వర్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. సోహ్నాలో పరిస్థితి మెరుగుపడింది. మార్కెట్లు త్వరలో తెరవవచ్చు. కానీ నుహ్, సోహ్నా సంఘటనకు నిరసనగా మంగళవారం బాద్షాపూర్‌లో మార్కెట్లను మూసివేశారు.

విశాఖలో నిరుద్యోగుల భిక్షాటన

విశాలాంధ్ర – విశాఖ: రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు అటకెక్కడంతో నిరుద్యోగ సమస్య తీవ్రత పెరిగిందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.అచ్యుతరావు, వై.రాంబాబు ఆందోళనన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీ మేరకు వైసీపీ ప్రభుత్వం తక్షణం ఖాళీగా ఉన్న 2.30లక్షల ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కోరుతూ విశాఖ ఆర్ కే బీచ్ పరిసరాల్లో ఏఐవైఎఫ్ మంగళవారం విన్నూత్న రీతిలో భిక్షాటన కార్యక్ర మం నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు మృగ్యమ య్యాయని విమర్శించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ అప్పులు చేస్తూ ప్రభుత్వాన్ని నడపటమే ఎజెండాగా మార్చుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో భిక్షాటన ద్వారా వచ్చిన డబ్బుని ప్రభుత్వానికి ఆర్థిక సాయంగా అందిస్తామని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి అసత్య ప్రచారాలు మానుకొని వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరుద్యోగులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యు.నాగరాజు, సహాయ కార్యదర్శి కొమర సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ ద్రోహి జగన్

విశాలాంధ్ర-నందికొట్కూరు: రాయలసీమలో ప్రాజెక్టుల నిర్మాణం కోసం రూ.12 వేల కోట్లు టీడీపీ ప్రభుత్వం ఖర్చు చేస్తే, వైసీపీ ప్రభుత్వం రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని, రాయలసీమ ద్రోహి జగన్‌మోహన్‌రెడ్డి అని మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు వైసీపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. మంగళ వారం నంద్యాల జిల్లా నందికొట్కూరులో సాగునీటిపై యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా ఆయన ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని సందర్శించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా నందికొట్కూరులోని పటేల్ సెంటర్‌లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 1983లో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రి అయిన తరువాతనే సీమ దశ మారిందన్నారు. ఎస్ఆర్‌బీసీ తీసుకువచ్చి రాయలసీమను సస్యశ్యామలం చేసిన ఘనుడు ఎన్టీఆర్ అన్నారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో సాగు, తాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం రూ.68 వేల కోట్లు ఖర్చు చేశామని, వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలుగు న్నర సంవత్సరాలలో రూ.22 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని తెలిపారు. రాయలసీమలో రూ.12 వేల కోట్లు ఖర్చు చేయడమే కాకుండా వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులు పనులు ప్రారంభోత్సవానికి నాంది పలికామని, వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పనులు నిలుపుదల చేశారన్నారు. ఈ సైకో అలగనూరు ప్రాజెక్టుకు నీళ్లు లేకుండా చేశా దని ఆరోపించారు. ఒక్క డీఎస్సీ లేదని, జాబ్ క్యాలెండర్ లేదని, యువతకు ఉపాధి అవకాశాలు, పరిశ్రమలు లేవని ధ్వజమెత్తారు. ఉన్న పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయన్నారు. కర్నూలు నుంచి నందికొట్కూరు రోడ్డు ఎలా ఉందో మీరు చూస్తున్నారు. రోడ్డుకు మట్టి వేయలేని సైకో మూడు రాజధానులు కడతాడంటా అని ఎద్దేవా చేశారు. మన రాష్ట్ర రాజధాని ఎక్కడ ఉంది. కర్నూలుకు న్యాయ రాజధాని వచ్చిందా అని ప్రజలను ప్రశ్నించారు. రూ.90 కోట్లతో ఓర్వకల్లు విమానాశ్రయాన్ని తాను నిర్మించి ప్రారంభిస్తే ఆయన మరలా రాయి వేసుకున్నారని ఆరోపిం చారు. నందికొట్కూరు నియోజకవర్గం అభివృద్ధికి రూ.1,250 కోట్లు ఖర్చు చేశామన్నారు. పరదాల మాటున తిరగడం కాదు... నీకు ధైర్యం ఉంటే నందికొట్కూరు రా అభివృద్ధిపై చర్చించుకుందాం అని సవాలు విసిరారు. నందికొట్కూరులో ఒక నాయకుడు రూ.5 లక్షకు ఒక ఎకరా కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలకు రూ.60 లక్షలకు అమ్ముకున్నా రని ఆరోపించారు. నీ రౌడీయిజం నా దగ్గర సాగదు, ఖబడ్దార్ జాగ్రత్తా అని నందికొట్కూరుకు చెందిన వైసీపీ యువనేతను హెచ్చరించారు. అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు రూ.110 కోట్లు ఖర్చు చేస్తే, ఇంతవరకు మంచినీరు ఇవ్వలేదని తెలిపారు. ఎనిమిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని, మద్యం ధరలు తగ్గించడమే కాకుండా నాణ్యమైన మందు అందిస్తానన్నారు. అమ్మకు వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ అమ్మఒడి అందిస్తామని, ఉచితంగా సంవత్సరంలో మూడు గ్యాస్ సిలిండర్లను అందచేస్తామని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, బీసీ సోదరుల రక్షణ చట్టం, ప్రత్యేక బడ్జెట్, నెలనెలా మహిళలకు రూ.1,500 నగదు అందజేస్తానని చంద్రబాబు చెప్పారు. పోలవరం పూర్తి చేస్తానని చెప్పారు. సాగునీటిపై యుద్ధభేరి కార్యక్రమం నందికొట్కూరులో ప్రారంభమై శ్రీకాకుళం జిల్లా పాతపట్నం వరకు సుమారు 2,500 కిలోమీటర్లు ఈ యాత్ర ఉంటుందని అన్నారు. నందికొట్కూరులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మాండ్ర శివానంద రెడ్డి, బాబు దృష్టికి తీసుకురాగా తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షులు బీటీ నాయుడు, మల్లెల రాజశేఖర్‌గౌడ్, మాజీ మంత్రులు భూమా అఖిలప్రియ, ఏరాసు ప్రతాపరెడ్డి, బీసీ జనార్ధనరెడ్డి, ఇన్‌ఛార్జ్‌లు తిక్కారెడ్డి, గౌరు చరితారెడ్డి, గౌరు వెంకట రెడ్డి, మీనాక్షినాయుడు, భూమా బ్రహ్మానందరెడ్డి, కేశ శ్యాంబాబు, ధర్మారం సుబ్బారెడ్డి, జగత్‌విఖ్యాతరెడ్డి, ఆకే ప్రభాకర్, చిన్న వెంకటస్వామి, పెద్దఎత్తున టీడీపీ శ్రేణులు, నాయకులు తరలివచ్చారు.

'అవిశ్వాసం'పై 8న చర్చ

(మొదటిపేజీ తరువాయి)

చర్చ జరగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అందుకు అంగీకారం కుదరని పక్షంలో మంగళవారం బీఏసీ సమావేశం నుంచి ఇండియా కూటమి ఎంపీలు వాకౌట్ చేశారు. 8న మొదలై 10వ తేదీ వరకు అవిశ్వాస తీర్మానంపై చర్చ కొనసాగుతుందని, చివరగా ప్రధాని మోదీ సమాధానమిస్తారని సీనియర్ నేత ఒకరు తెలిపారు. అయితే 16వ లోక్‌సభలో తెలుగు దేశం పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై మరుసటి రోజే చర్చ జరిగిందని ప్రతిపక్ష నేతలు గుర్తుచేశారు. ప్రస్తుతం జరుగుతున్న జాప్యాన్ని దుయ్యబట్టారు. ఈనెల 8న అవిశ్వాస తీర్మానంపై చర్చ ప్రారంభించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ వెంటనే చేపట్టేలా ఎలాంటి నియమాలు లేవని, దానిపై 10రోజుల్లోగా చర్చించవచ్చని ప్రభుత్వం వాదిస్తోంది. కాగా, కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ జులై 26న లోక్‌సభలో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, అవసరమైన మద్దతు లభించడంతో దానిని స్పీకర్ బిర్లా స్వీకరించారు.

ఎఫ్ఐఆర్ నమోదుకూ తీరికలేదా?

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్న చర్యలు ఏమిటి? వంటి సమగ్ర వివరాలను ఇవ్వాలన్నది. 'ఎఫ్ఐ ఆర్‌లు చాలా పొడవుగా ఉన్నాయి. ఇప్పటివరకు అరెస్టులు జరగలేదు. వాంగ్మూలాలు రికార్డు చేయలేదు. శాంతిభద్రతలు, రాజ్యాంగ యంత్రాం గం పూర్తిస్థాయిలో కుప్పకూలాయి' అని సీజేఐ చంద్రచూడ్ అన్నారు. జులై 20న వెలుగుచూసిన అమానుష వీడియోపై కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు సుదీర్ఘ జాప్యం జరిగిందని స్పష్టమైందన్నారు. హింస నేపథ్య కేసుల దర్యాప్తులో అలసత్వాన్ని సుప్రీంకోర్టు దుయ్యబట్టగా అటార్నీ జనరల్ స్పందిస్తూ 'మేము యుద్ధం మధ్యలో ఉన్నాం. సరిహద్దు ప్రాంతాల్లో కలచి వేసే ఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఈ కేసులో ఆచితూచి ముందుకు సాగాల్సి ఉంది' అని అన్నారు. ఆయన సాకులు వినేందుకు విముఖత వ్యక్తంచేసిన ధర్మాసనం 'రెండు నెలలైంది. కనీసం ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసే పరిస్థితి లేదా? అంటే మే నుంచి జులై చివరి వరకు రాష్ట్రంలో రాజ్యాంగ యంత్రాంగం పూర్తిస్థాయిలో కుప్పకూలిందని, కనీసం ఎఫ్ఐ ఆర్ నమోదు చేయలేని స్థితిలో మీరు ఉన్నారని చెబుతున్నారా? పరిస్థితి చేయి దాటిన కారణంగా పోలీసులు ఎవరినీ అరెస్టు చేయలేకపోయారా? పోలీసు అధికారి ఆ ప్రాంతానికి వెళ్లి అరెస్టు చేయలేని పరిస్థితి ఉందా? పౌరులకు రక్షణ కల్పించే శాంతిభద్రతలు లేకపోతే పౌరుల పరిస్థితి ఏమిటి?' అని ధర్మాసనం ప్రశ్నించింది. 11 కేసుల్లో ఓ జువనైల్‌తో పాటు ఏడుగురిని మాత్రమే అరెస్టు చేయడాన్ని తీవ్రంగా పరిగణించింది. క్షేత్రస్థాయి పరిస్థితులు తీవ్రంగా ఉండటం వల్ల వెంటనే చర్యలు తీసుకోలేకపోయాం గానీ విషయం కేంద్రం దృష్టికి వెళ్లిన వెంటనే తగు చర్యలు చేపట్టామని సొలిసిటర్ జనరల్ కోర్టుకు వెల్లడించారు. రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నట్లు చెప్పారు. మేలో హింస మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు 6,523 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని మణిపూర్ ప్రభుత్వం తరపున తెలిపారు. కేంద్రం, మణిపూర్ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ వాదనలు వినిపించారు. మహిళలను నగ్నంగా ఊరేగించిన వ్యవహారంలో జీరో ఎఫ్ఐఆర్‌ను పోలీసులు నమోదు చేశారని కోర్టుకు తెలిపారు.

నేడు ముర్ముతో విపక్షాల భేటీ

(మొదటిపేజీ తరువాయి)

ఎంపీలు రాష్ట్రపతిని కలవనున్నారు. 'జులై 29, 30 తేదీల్లో మణిపూర్‌లో పర్యటించిన ఇండియా కూటమిలోని 21 మంది ఎంపీలతో పాటు ఫ్లోర్ లీడర్లు ఆగస్టు 2వ తేదీ ఉదయం 11.30 గంటలకు రాష్ట్రపతి ముర్ముతో సమావేశం కానున్నారు' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వెల్లడించారు. మణిపూర్‌పై పార్లమెంటులో ప్రధాని ప్రకటన, అనంతరం అక్కడి పరిస్థితులపై సమగ్ర చర్చను ప్రతిపక్ష కూటమి కోరుతున్న విషయం విదితమే.

సహకార ఫెడరలిజానికి సమాధి...

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యాంగాధారితం కాబోవని వ్యాఖ్యానించారు. ఢిల్లీకి సంబంధించి ఎలాంటి చట్టాన్నైనా తెచ్చే అధికారం పార్లమెంటుకు రాజ్యాంగం ఇచ్చిందని చెప్పారు. ఈ బిల్లును జులై 25న కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఢిల్లీ బిల్లును ప్రవేశపెట్టడంపై ప్రతిపక్ష సభ్యులు తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేశారు. వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. కొన్ని పత్రాలు చించి స్పీకర్ వైపునకు కొందరు విసిరారు. బిల్లుపై అమిత్‌షా మాట్లాడటం ప్రారంభించినప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సుశీల్ కుమార్ రింకు వెల్‌లోకి కెళ్లి నిరసన తెలిపారు. తనను మాట్లాడనివ్వలేదన్నారు. ఈ పద్ధతి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని, బీఆర్ అంబేద్కర్‌ను అవమానిస్తోందని దుయ్యబట్టారు. రింకుతో పాటు కాంగ్రెస్ నేత టీఎన్ ప్రతాపన్ కొన్ని కాగిలాలను చించి సభాపతి వైపునకు విసిరారు. సభలో గందరగోళం నెలకొనగా స్పీకర్ ఓంబిర్లా స్పందిస్తూ 'దేశం చూస్తోంది. ఈ పద్ధతి మంచిది కాదు' అని సభ్యులతో అన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్‌నేత అధిర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ సహకార ఫెడరలిజాన్ని సమాధి చేసే విధంగా ఈ బిల్లు రూపొందిందని వ్యాఖ్యానించారు. ఎన్నికైన ఢిల్లీ ప్రభుత్వ హక్కులను హరించేదిగా ఉందన్నారు. దీనిని అడ్డుపెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చాలని కేంద్రం భావిస్తోందని విమర్శించారు. ఆర్ఎస్‌పీ నేత ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ మాట్లాడుతూ ఈ బిల్లును తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఇందుకు మూడు ప్రధాన కారణాలు ఉన్నాయన్నారు. 'బిల్లును ప్రవేశపెట్టేందుకు చట్టబద్ధ అర్హతను ప్రశ్నిస్తున్నా. రాజ్యాంగం సూచించే ఫెడరిజం సూత్రాలకు ఇది విరుద్ధం. బ్యూరోక్రాట్లపై ఢిల్లీలో ఎన్నికైన ప్రభుత్వానికి అధికారం ఉండకపోవడమంటే అసలు ఢిల్లీలో ప్రభుత్వం లేనట్టే అవుతుంది' అని అన్నారు. ప్రేమ్‌చంద్రన్ వ్యాఖ్యలపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి స్పందిస్తూ బిల్లును ఆమోదించే అర్హత పార్లమెంటుకు ఉందని చెప్పారు. బిల్లు ప్రయోజనాలపై మాట్లాడాలని భావిస్తే దాని పరిశీలన, ఆమోదం సమయంలో నిర్వహించే చర్చలో మాట్లాడాలని సూచించారు. ఏఐఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కూడా అభ్యంతరం తెలిపారు. ఓ బిల్లును తెచ్చి రాజ్యాంగాన్ని మార్చేయలేరన్నారు. వేర్వేరు అధికారాల సిద్ధాంతాన్ని అతిక్రమించేలా, 2018లో ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీం ధర్మాసనం తీర్పునకు విరుద్ధంగా బిల్లు ఉందని అన్నారు. ఈ బిల్లుకు అవసరమైన చట్టబద్ధ అర్హత సభకు లేనందునే దానిని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. లోక్‌సభలో ఈ బిల్లును ఆమోదించగలరేమో రాజ్యసభలో దానిని అడ్డుకునేందుకు అవసరమైన సంఖ్యాబలం ప్రతిపక్షాలకు ఉందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు. రాజ్యాంగాన్ని, సుప్రీంకోర్టు తీర్పుకు, భారత ఫెడరల్ వ్యవస్థకు విరుద్ధంగా ఢిల్లీ బిల్లు ఉందన్నారు. టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును తోసిపుచ్చే విధంగా తాజా బిల్లు ఉందని, ఢిల్లీ ప్రభుత్వ శాసనాధికారాలను రద్దు చేసేదిగా రూపొందిందన్నారు. ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా మాట్లాడుతూ ఆర్డినెన్స్ కంటే ఘోరంగా బిల్లు ఉందని, ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి, ఢిల్లీ ప్రజలకు పూర్తి విరుద్ధమైన విధంగా రూపొందిందని అన్నారు. ఇది అప్రజాస్వామిక బిల్లు అని, ఎన్నికైన ఢిల్లీ ప్రభుత్వ హక్కులను హరించి 'బాబు'లకు కట్టబెడుతుందని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం స్థానంలో 'బాబూ'స్వామ్యాన్ని తెస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కూడా బిల్లును తిరస్కరించారు. ఢిల్లీ ఎన్‌సీటీని తక్కువ చేసేదిగా ప్రజాస్వామ్య ప్రాతినిధ్య సిద్ధాంతాలను తుంగలో తొక్కేదిగా ఉన్నట్లు వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే, ఢిల్లీ బిల్లుకు బీజేడీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ తమ మద్దతును ప్రకటించాయి. ఇండియా కూటమిలోని ప్రతిపక్ష పార్టీల ఎంపీలు 109 మందితో పాటు కపిల్ సిబల్ వంటి స్వతంత్రులు ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తారని ఓ సీనియర్ నాయకుడు చెప్పారు.

కొన్ని మార్పులు- చేర్పులు

ఢిల్లీ ఆర్డినెన్స్ స్థానె తెచ్చిన బిల్లులో కొన్ని మార్పులు-చేర్పులు జరిగాయి. ఆర్డినెన్స్‌లోని అన్ని ప్రధాన నిబంధనలు ఉన్నాగానీ కొన్ని సవరణలు ఉన్నాయి. 'సేవలు'పై ఏదేని చట్టాన్ని తెచ్చే విధంగా రాష్ట్ర అసెంబ్లీని కట్టడి చేసేలా ఆర్డినెన్స్‌లోని నియమాలు తాజా బిల్లులో లేదు. ఆలిండియా సర్వీసెస్, దానిక్స్‌కు చెందిన అధికారుల నియామకాలపై ఢిల్లీ ప్రభుత్వం మీద పెత్తనానికి కేంద్ర ప్రభుత్వానికి అధికారాన్ని ఈ బిల్లు కట్టబెడుతుంది. కేంద్రప్రభుత్వానికి వార్షిక నివేదికను ఢిల్లీ ప్రభుత్వం ఇవ్వాలన్న నిబంధనతో పాటు కేంద్రానికి సిఫార్సు చేసే ప్రతిపాదలపై మంత్రిత్వశాఖ సూచనలు/ఆదేశాలను లెఫ్టినెంట్ గవర్నర్, ఢిల్లీ సీఎంకు సమర్పించాలన్న నియమాన్ని తొలగించారు. ఎల్‌జీ నియామకానికి సంబంధించిన ప్యానల్‌కు అర్హులైన వారిని సిఫార్సు చేసే అధికారాన్ని ఎన్‌సీటీ ప్రభుత్వానికిస్తూ బిల్లులోని సెక్షన్ 45ఇలో సబ్ సెక్షన్ (బి)ను జోడించారు. ఇలాంటి అధికారులను రాష్ట్రపతి లేదా కేంద్రానికి కట్టబెట్టేలా తొలుత రూపొందిన ఆర్డినెన్స్ ఉంది. ఢిల్లీ ప్రభుత్వంలో సీనియర్ అధికారుల నియామకాలు, బదిలీలను ఢిల్లీ ముఖ్యమంత్రి నేతృత్వ త్రిసభ్య కమిటీ చేపట్టేలా బిల్లు పేర్కొంది.

సాగుభూములే పేదలకు శాశ్వత జీవనోపాధి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జల్లి విల్సన్

రెడ్డిగూడెం-విశాలాంధ్ర: వ్యవసాయాధారిత మనదేశంలో అత్యధికశాతంలో ఉన్న గ్రామీణ నిరుపేదలకు సాగుభూములు దక్కినప్పుడే వారికి శాశ్వత జీవనోపాధి ఏర్పడి దారిద్ర్యం నుంచి విముక్తి పొందగలుగుతారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ ఉద్ఘాటించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రథమ మహాసభ రెడ్డిగూడెంలో జరిగింది. సగ్గుర్తి కోటేశ్వరరావు, వేల్పుల కాంతయ్య, మేకల కుమారి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. మహాసభ ప్రారంభ సూచికంగా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు వల్లంకొండ బ్రహ్మం సంఘ పతాకాన్ని ఎగురవేశారు. మహాసభలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, గత 90 సంవత్సరాలుగా వ్యవసాయ కార్మిక సంఘం గ్రామీణ శ్రమ జీవుల హక్కులకోసం ముఖ్యంగా సమాజాన్ని పట్టి పీడిస్తున్న కుల వివక్షతల నిర్మూలన, భూమి కోసం, భుక్తికోసం పోరాడుతోందన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా సామాజిక సమానత్వం కోసం, దోపిడి రహిత సమాజం కోసం రాజ్యాంగంలో నిర్దేశించిన ప్రకారం కూడూ, గూడు, వస్త్రాల సాధన కోసం ఇంకా గ్రామీణ కష్టజీవులకు సంబంధించి అన్ని సమస్యలపై వీరోచితంగా నిర్వహించిన పోరాటాల చరిత్రను వివరించారు. భూ పోరాటాలకు మైలవరం నియోజకవర్గ తలమానికంగా నిలబడిందని అందునా రెడ్డిగూడెం మండలంలో జరిగిన ఉద్యమఘట్టాలను వివరించారు. ఎన్టీఆర్‌జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘాన్ని మరింత బలోపేతం చేసి గ్రామీణ పేదలకు వెన్నుదన్నుగా నిలబడాలని జల్లి విల్సన్ ఉద్బోధించారు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కులమత ప్రాంతీయ భాషా విద్వేషాలను రెచ్చగొడుతూ ఎలాంటి దుర్మార్గపు పాలన సాగిస్తూదో వివరించి ఇలాంటి దుష్టశక్తుల అటకట్టించేందుకు పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోను, రాష్ట్రంలోను ప్రజావ్య వ్యతిరేక విధానాలును ప్రతిఘటించి తీరాలని అన్నారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ, వ్యవసాయ కార్మిక సంఘాన్ని గ్రామ స్థాయిలో పటిష్టపరచుకొని గ్రామీణ శ్రమ జీవుల సమస్యల పరిష్కారానికి అహోర్నిశలు కృషి చేయాలన్నారు. సంఘం బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తూము కృష్ణయ్య కూడా మాట్లాడారు. ప్రజానాట్యమండలి నాయకులు ఆర్ పిచ్చయ్య ఆలపించిన విప్లవగేయాలు సభికులను ఉత్తేజపరిచాయి. సంఘం జిల్లా కన్వీనర్ చిలుకూరి వెంకటేశ్వరరావు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. మహాసభ జిల్లా నూతన నాయకత్వాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. జిల్లా గౌరవాధ్యక్షులుగా ఆర్ పిచ్చయ్య, అధ్యక్షులుగా ఉప్పే నరసింహారావు, ఉపాధ్యక్షులుగా కారుమూరి రత్నకుమారి, ప్రధాన కార్యదర్శిగా చిలుకూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా వేల్పుల కాంతయ్య మరో 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్- కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, ఫీజుల దోపిడీ నివారించాలని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మంగళవారం లేఖ రాశారు. ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీ, విద్యాశాఖ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహణ, అర్హత అనుభవం లేని అధ్యాపకులతో బోధన, అనుమతులు లేకుండా కోచింగ్ సెంటర్ల నిర్వహణ వంటివాటిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా హాస్టల్ నడుపుతున్నారని పేర్కొన్నారు. విద్య పేరుతో మానసిక శారీరక వేధింపులు, భౌతిక దాడులు చేయడం వంటి వివిధ ఘటనలు కొనసాగుతున్నాయన్నారు. విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం ఉచిత విద్య ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉచిత విద్య, ఆన్‌లైన్ ప్రవేశాలకు సంబంధించి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పన, ప్రచారం చేయడం కానీ, అధికారులను గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందిని సమాయత్తం చేయడంలో ఎందుకు నూరు శాతం విజయం సాధించలేకపోయారని ప్రశ్నించారు. విద్యా వ్యాపారం కాకుండా ఫీజుల దోపిడీని అడ్డుకోవాలని, పిల్లల భద్రత రక్షణకు భరోసా ఇవ్వాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు.

తెలుగు రాష్ట్రాల్లో ఈడీ సోదాల కలకలం

టీడీపీ నేత రాయపాటి ఇంటిపై ఈడీ దాడి

విశాలాంధ్ర బ్యూరో-గుంటూరు/అమరావతి: తెలుగు రాష్ట్రాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మంగళవారం ఆకస్మిక దాడుల్ని నిర్వహించింది. ఇందులో బడా వ్యాపార వేత్తలు, రాజకీయ నేతలున్నారు. హైదరాబాద్, గుంటూరుతోపాటు 9 ప్రాంతాల్లో విస్తృతంతా ఈడీ బృందాలు సోదాలు చేశాయి. మొత్తం 15 బృందాలు ఏకకాలంలో సోదాల్ని నిర్వహించాయి. ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ డైరెక్టర్ల ఇళ్లు, కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు తనిఖీలు నిర్వహించారు. టీడీపీ నేత, మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు, మలినేని సాంబశివరావుతోపాటు మరికొందరు ఆ సంస్థలో డైరెక్టర్లుగా ఉన్నారు. ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ దాదాపు 13 బ్యాంకుల నుంచి రూ.9వేల కోట్లకుపైగా రుణాలు తీసుకుంది. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను డొల్ల కంపెనీలకు మళ్లించినట్లు సీబీఐ గతంలో కేసు నమోదు చేసింది. ఆ కేసు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీకి చెందిన బ్యాంకు ఖాతాల నుంచి సింగపూర్‌కు నిబంధనలకు విరుద్ధంగా నగదు బదిలీ అయినట్లు ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు. హైదరాబాద్, గుంటూరులోని రాయపాటి నివాసాల్లో ఈడీ సోదాలు నిర్వహించారు. అటు హైదరాబాద్ నగరంలోనూ ఈడీ సోదాల్ని నిర్వహించింది. జూబ్లీ హిల్స్, మణికొండ, పంజాగుట్టలో మంగళవారం ఉదయం నుంచే దాడుల పరంపర కొనసాగింది.

సహకార సంఘాల ఎన్నికలు వాయిదాతో కాలయాపన

ఏపీ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-విజయవాడ: సహకార రంగ మూల సూత్రాలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించ కుండా వాయిదాలు వేస్తూ త్రిసభ్య కమిటీలతో కాలయాపన చేయటం తగదని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. సహకార సంఘాలకు 2013లో ఎన్నికలు జరిగాయి..2018లో పాలక వర్గాల పదవీకాలం ముగిసింది..అప్పటి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా పాలకవర్గాలనే కొనసాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఆనాటి పాలక వర్గాలను రద్దు చేసి త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటికి 5 పర్యాయాలు సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా ఏక పక్షంగా తమ మద్దతుదారులతో కమిటీలు ఏర్పాటు చేశారని చెప్పారు. ఇది సహకార వ్యవస్థ మూల సూత్రాలకు విరుద్ధమని, ప్రజా స్వామ్య హక్కులను హరించడమే అవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2,600 ప్రాథమిక, వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతాంగానికి పంట రుణాలు, ఇతర దీర్ఘకాలిక రుణాల మంజూరుకు ఈ కమిటీలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అయితే మరో పర్యాయం ఎన్నికలు నిర్వహించకుండా తిరిగి త్రిసభ్య కమిటీలనే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులిచ్చిందని తెలిపారు. ప్రభుత్వాలు ఎన్నికలు నిర్వహించకుండా పదే పదే ఏర్పాటు చేస్తున్న ఈ తాత్కాలిక కమిటీలపై రైతాంగం తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తుందన్నారు. ఈ కమిటీల పనితీరులో అనేక అవకతవకలు చోటు చేసుకుంటున్నట్లు, రుణాల మంజూరులో తమ వర్గాల వారికే ప్రాధాన్యతనిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలకు భంగం కలగకుండా సహకార సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరించకుండా రాష్ట్ర ప్రభుత్వం తక్షణం సహకార సంఘాలకు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులకు ఏపీ స్టేట్ కార్పోరేషన్‌కు ఎన్నికలు నిర్వహించాలని కేవీవీ ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.

సీపీఐ బస్సుయాత్ర జయప్రదం చేయండి

ఓబులేసు పిలుపు

విశాలాంధ్ర-కడప బ్యూరో : ప్రజాకంటక మోదీని గద్దె దించుదాం - దేశాన్ని కాపాడుకుందాం! జగన్ ఏకపక్ష నిరంకుశ పాలన నుంచి రాష్ట్రాన్ని రక్షించుకుందాంఅన్న నినాదంతో ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 8 వరకు సీపీఐ నిర్వహించనున్న బస్సుయాత్ర జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి. ఓబులేసు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో పి.సుబ్బరాయుడు అధ్యక్షతన మంగళవారం జరిగిన సీపీఐ జిల్లా సమితి సమావేశంలో ఓబులేసు మాట్లాడుతూ గడచిన 9 సంవత్సరాల మోదీ పాలన అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందన్నారు. 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయకపోగా రైతుల, కార్మికుల, మహిళల, విద్యార్థి, యువజనుల హక్కులను హరించే రీతిలో దుష్టచట్టాలు, 3 వినాశకర వ్యవసాయ చట్టాలు, 44 కార్మిక చట్టాల స్థానంలో 4 కోడ్‌లు తెచ్చి 29 కార్మిక చట్టాలను మింగేశారన్నారు. శాస్త్రీయ విద్యా విధానానికి తూట్లు పొడుస్తూ జాతీయ విద్యా విధానం పేరుతో విద్యను కాషాయీకరణ చేసేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఇలాంటి దుర్మార్గ పాలన నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని తెలిపేందుకు, మోదీ పీడ విరగడైతే తప్ప దేశానికి రక్షణ లేదనే వాస్తవ విషయాలను ప్రజలతో పంచుకోవటానికి సీపీఐ ప్రచారజాతా నిర్వహిస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి పాలన అన్ని విధాల అభాసుపాలైందన్నారు. 2019లో నిలబెట్టుకోవాలనే దుష్టచింతనతో కూల్చివేతలకు, కక్షసాధింపు చర్యలకు పూనుకొన్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను రాజధాని లేని రాష్ట్రంగా మార్చడానికి ఎన్నిరకాల పల్టీలు కొట్టారో, రాష్ట్రానికి అడుగడుగునా మోసం, ద్రోహం చేసిన కేంద్రంలోని బీజేపీకి ఊడిగం చేస్తూ రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారు. ఓట్ల కోసం బటన్ నొక్కాలనే సిద్ధాంతంతో పాలన చేస్తున్న జగన్ చెర నుంచి రాష్ట్రాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందనే విషయాన్ని గుర్తుచేయడానికి బస్సుయాత్ర ద్వారా సీపీఐ ప్రచార జాతా నిర్వహిస్తున్నదని తెలిపారు. . ఈ బస్సుయాత్ర ఆగస్టు 17న విశాఖపట్నంలో ప్రారంభమై, సెప్టెంబర్ 8వ తేదీన తిరుపతిలో భారీ బహిరంగసభతో ముగుస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, కె.ఆంజనేయులు, ఎంవీ సుబ్బారెడ్డి, ఎన్.వెంకటశివ, బషీరున్నిసా, పి.చంద్రశేఖర్, ఎన్.విజయలక్ష్మి, వి. వీరశేఖర్, జి.వేణుగోపాల్, కేసీబాదుల్లా పాల్గొన్నారు.

తొలితరం కమ్యూనిస్టు మాకిరెడ్డి దేముడు మృతి

విశాలాంధ్ర-నర్సీపట్నం: తొలితరం కమ్యూనిస్టు నాయకుడు, భూ పోరాటయోధుడు, ఉమ్మడి విశాఖ జిల్లా రైతు సంఘం నాయకులు మాకిరెడ్డి దేముడు (96) మంగళవారం మరణించారు. అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం మండలంలోని స్వగ్రామంలో ఆయన అంతిమ సంస్కారాలు ముగిశాయి. అంతిమ యాత్రలో పాల్గొని సీపీఐ నేతలు కొందరు నివాళులర్పించగా మరికొందరు సంతాపాన్ని ప్రకటించారు. అంతిమయాత్రలో సీపీఐ ఆంధ్రప్రదేశ్ సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, కో-పరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ మాకిరెడ్డి దేముడు విద్యార్థి దశ నుంచి పార్టీలో ఉన్నారని, అనేక భూ పోరాటాలు సాగించారన్నారు. విశాఖ, నర్సీపట్నం మండలంలోని గబ్బాడ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఐదుసార్లు సేవలు అందించారని, నీరాడబరంగా జీవించారని, తుది వరకు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడ్డారని, ఆయన ఆశయాలను స్మరించుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి కార్యకర్త పనిచేయాలని జేవీఎస్ మూర్తి పిలుపునిచ్చారు. రాఘవేంద్రరావు మాట్లాడుతూ దేముడు ధనిక కుటుంబంలో పుట్టినప్పటికీ సాదాసీదాగా జీవించారని చెప్పారు. వయస్సుతో నిమిత్తం లేకుండా అందరినీ గౌరవించే స్వభావం ఆయనదని శ్లాఘించారు. దేముడుకు నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా నాయకులు బాలేపల్లి వెంకటరమణ, మాకిరెడ్డి రామునాయుడు, రాజాన దొరబాబు, జి.గురు బాబు, క్రాంతి, సుబ్బలక్ష్మి, రాజు,రాధాకృష్ణ, వామపక్ష - ప్రజాసంఘాల నాయకులు, శ్రేయోభిలాషులు, బంధుమిత్రులు ఉన్నారు.

రైతు సంఘం సంతాపం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఉమ్మడి విశాఖ జిల్లా రైతు సంఘం సీనియర్ నాయకులు మాకిరెడ్డి దేముడు మృతికి అఖిల భారత కిసాన్‌సభ అధ్యక్షులు రావుల వెంకయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా అనేక రైతాంగ ఉద్యమాల్లో పాల్గొన్నారని, గబ్బాడ గ్రామానికి ఐదుసార్లు సర్పంచ్‌గా పనిచేశారని, ఆయన కుమార్తె గంగాభవాని కూడా సర్పంచ్ అయ్యారన్నారు. ఆమె ప్రస్తుతం రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారని నేతలు పేర్కొన్నారు.

‘నిత్య పెళ్లికొడుకు’ చిత్రం తీస్తా

- పరిశీలనలో చాలా పేర్లు
- బ్రో అట్టర్ ఫ్లాప్- వసూళ్లు తగ్గాయి
- జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు కీలక వ్యాఖ్యలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: త్వరలో చిత్ర నిర్మాతగా మారనున్నట్టు జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రకటించారు. నిర్మాతగా తాను తీయబోయే చిత్రం పేరు నిత్య పెళ్లికొడుకు అని తెలిపారు. తాను తీయబోయే కథా వస్తువునకు సంబంధించి ప్రస్తుతం తన దగ్గర నిత్య పెళ్లికొడుకుడు టైటిల్‌తోపాటు పెళ్లిళ్లు-పెటాకులు, తాళి-ఎగతాళి, మూడు ముళ్లు-ఆరు పెళ్లిళ్లు, బహు భార్యా ప్రావీణ్యుడు, మ్రో (మ్యారేజెస్-రిలేషన్స్-అఫెండర్) తదితర పేర్లు పరిశీలనలో ఉన్నాయన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మంత్రి అంబటి మాట్లాడుతు బ్రో ఘోర పరాజయ చిత్రమన్నారు. పవన్ కల్యాణ్ చిత్రాలు ఇక ఆడబోవన్నారు. నాపై వివాదస్పదం చేసి వసూళ్లు పెంచుకోవాలని చూస్తున్నారన్నారు. తీసుకున్న పారితోషికానికి గాను పవన్ ఆదాయ పన్నుల శాఖకు లెక్కలు చెప్పాడా అని ప్రశ్నించారు. నిర్మాత డబ్బులతో రాజకీయ కక్ష సాధింపులకు ఈ చిత్రాన్ని వాడుకున్నాడని, మరోవైపు టీడీపీ నిర్మాతను అడ్డం పెట్టి, చంద్రబాబు నుంచి ప్యాకేజీ తీసుకున్నారంటూ ఆరోపించారు. బ్రో చిత్రంలో ఒక పాత్ర పేరు శ్యాంబాబు అని పెట్టి...ఆ పాత్రను పవన్ కల్యాణ్ దూషించి, కించపరిచేలా సృష్టించారని తాను భావిస్తున్నానన్నారు. అంతటితో ఆగకుండా దానిలో నటించిన నటులు అదే పనిగా మాట్లాడుతున్నారంటూ ధ్వజమెత్తారు. సిన్మాలను సిన్మాలుగానే తీయాలని, ఎవరో నిర్మాత డబ్బులు పెడితే...దానిలో తన శత్రువుల పేర్లు పెట్టి దూషించి ..పైశాచిక ఆనందం పొందాలను కున్నప్పుడు దానిపై దృష్టి పోతుందని, అది వాణిజ్య పరంగా ప్రేక్షకుల ఆదరణ పొందబోదని స్పష్టంచేశారు.

త్రివిక్రమ్, పవన్ కల్యాణ్ కూర్చుని ఒక సన్నివేశాన్ని సృష్టించి, దానికి మాటలు రాసి దానిలో నన్ను ఇమిడ్చి ఒక ఆనందాన్ని పొందాలని ప్రయత్నించారన్నారు. ఈ చిత్రానికి మొత్తం వసూళు రూ.60 నుంచి రూ.70 కోట్లు వస్తాయనుకుంటుంటే పవన్ కల్యాణ్ పారితోషికం రూ.50 కోట్లు పైనే ఉందని, చివరికి కనీసం ఆయన పారితోషికం వచ్చే పరిస్థితులు లేకుండా ఈ చిత్రం ఆడుతోందని ఎద్దేవా చేశారు. వారాహి అనే ఒక పవిత్రమైన అమ్మవారిని తన కాళ్ల కింద పెట్టుకుని వాహనంగా నామకరణం చేశాడో, దానిపై నుంచి అవాకులు చెవాకులు, బూతులు మాట్లాడే ప్రయత్నించాడో ఆనాడే అమ్మవారి శాపం పవన్‌కు తగిలిందన్నారు. చంద్రబాబు ఇవ్వాల్సిన ప్యాకేజీని విశ్వప్రసాద్ ద్వారా అందించే కార్యక్రమాన్ని చేశారని, ఇందులో విజయవంతమయ్యారని చెప్పారు. తాను తీయబోయే చిత్రంలో దాని కథా ముగింపులో మహిళా లోకం మెచ్చుకునేలా గుణపాఠం ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా ఆ చిత్రానికి పరిశీలనలో ఉన్న పేర్లను మీడియాకు వెల్లడిస్తూ, పేర్లు ఏం పెట్టాలని ఆలోచిస్తున్నామని మంత్రి చెప్పారు. ఆ చిత్రంలో తనకు ఏ పాత్ర, తన నృత్య సన్నివేశమూ ఉంబోదన్నారు. అది లో బడ్జెట్ చిత్రమని స్పష్టం చేశారు. తాము తీయబోయే చిత్రానికి తగిన పేరును సూచించిన వారికి వేయి నూట పదహార్లు బహుమతి ఇస్తామని మంత్రి అంబటి ప్రకటించారు.

ఏసీబీ దాడుల్లో పట్టుబడిన ఇద్దరు అధికారులు

విశాలాంధ్ర-విజయవాడ : అవినీతి అధికారులపై వచ్చిన ఫిర్యాదులతో ప్రకాశం జిల్లా ఒంగోలు 2 టౌన్ పోలీస్ స్టేషన్, శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం మున్సిపల్ కార్పోరేషన్‌పై మంగళవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. దాడుల్లో ఇద్దరు అవినీతి అధికారులు పట్టుబడ్డారు. ఒంగోలుకు చెందిన బాధితుడు తన వాహనాన్ని మరొక వ్యక్తికి ఇవ్వగా, సదరు వ్యక్తి ఆ వాహనానికి నకిలీ డాక్యుమెంట్ సృష్టించి ఫిర్యాదుదారుడికి అప్పగించలేదు. దానిపై బాధితుడు తన సమస్యను పరిష్కరించమని లేదా ఎఫ్ఐఆర్ నమోదు చేయమని ఒంగోలు 2 టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ షేక్ మహబూబ్ బాషాను కలవగా రూ.90,000/- డిమాండ్ చేసి ముందుగా రూ.10,000 రూపాయలు అడ్వాన్సుగా తీసుకున్నారు. మిగతా బాలన్స్ కోసం డిమాండ్ చేయడంతో, ఫిర్యాది దారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీనిపైన కేసు నమోదు చేసుకున్న అధికారులు పోలీస్ స్టేషన్ ఎస్ఐ షైక్ మహబూబ్ బాషా ఫిర్యాదిదారుడి నుంచి రూ.40,000 రూపాయలు లంచంగా తీసుకుంటుండగా ఒంగోలు రేంజ్ అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడైన ఆధికారిని అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పర్చగా మేజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించారు.మరో ఘటనలో శీకాకుళం జిల్లా శ్రీకాకుళం టౌన్, భారతి నగర్ కు చెందిన బాధితుడు అతని ఖాళీ నివాస స్థలం సంబంధించిన పన్నును ప్రాసెస్ చేయడానికి శ్రీకాకుళం మున్సిపల్ కార్పోరేషన్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ గౌరి శంకరరావును కలవగా రూ.20,000/- డిమాండ్ చేయడంతో ఫిర్యాదిదారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న అధికారులు గౌరి శంకరరావు ఫిర్యాదిదారుడి నుంచి రూ.20,000 రూపాయలు లంచంగా తీసుకుంటుండగా శ్రీకాకుళం రేంజ్ అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడైన ఆధికారిని అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరిచారు.

మెడికల్ మాఫియాకు కేరాఫ్‌గా ఏపీ

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర

విశాలాంధ్ర బ్యూరో - అనంతపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మెడికల్ మాఫియాకు హబ్బుగా తయారయిందని మాఫియాను నియంత్రించాల్సిన ప్రభుత్వాధికారులే లంచాలకు పాల్పడుతున్నారని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు విమర్శించారు. మంగళవారం ఇక్కడి నీలం రాజశేఖర రెడ్డి భవన్ లో రాజేంద్ర బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో మెడికల్ మాఫియా ఆగడాలు రోజురోజుకు పెచ్చుమీరుతున్నాయన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ అనే పేర్లతో ప్రజల రక్తాన్ని జలగల్లా పీల్చుతు న్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.అవసరం లేకపోయినా అనేక రకాల టెస్టుల పేర్లతో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వేలాది రూపాయలు దండుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మా కంపెనీలు, ఏజెన్సీల నుంచి ఎక్కువ కమిషన్లు పొందేందుకు ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు రోగం పేరిట రోగులను, వారి బంధువులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తూర్పారబట్టారు. మెడికల్ మాఫియా రాష్ట్ర ప్రభుత్వాన్ని శాసించే స్థాయిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మెడికల్ మాఫియా నియంత్రించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోశ్‌కుమార్, నగర కార్యదర్శి మోహన్, అధ్యక్షుడు శ్రీనివాస్, కుల్లయుస్వామి, చిరంజీవి, నాయకులు ధనుంజయ, దేవా, లికిల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల ఉక్కిరి బిక్కిరి

- ప్రవీణ్ ప్రకాశ్ విభిన్న శైలి
- పాఠశాలల్లో నిత్య తనిఖీలు... చిన్న తప్పిదానికే చర్యలు
- వీడియో కాల్స్‌తో ఆరా... ఖాళీలు భర్తీపై మౌనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ‘ఆయన ఓ ఐఏఎస్ ఉన్నతాధికారి. నిత్యం తనిఖీల్లో నిమగ్నమవుతారు. పాఠశాలల తనిఖీలకు వెళ్లినప్పుడు నాడు-నేడు నిధులతో అభివృద్ధి చేసిన పాఠశాలల్లోని బల్లలపై దుమ్మును తన చేతితోనే శుభ్రం చేస్తారు. మరో పాఠశాలకు వెళ్లినప్పుడు పిల్లలు తాగునీటి కుళాయి వద్దకు వెళ్లి స్వయంగా తాగి గమనిస్తారు. అక్కడితో ఆయన ఆగరు. రెండో విడత సెమిస్టర్ పుస్తకాలు వివిధ పాఠశాలలకు వాహనాలపై తరలిరాగా, తానే వాహనంపై ఎక్కి ఒక కార్మికుడి తరహాగా పుస్తకాలను ఉపాధ్యాయులకు అందజేస్తారు. ఇటీవల మరో పాఠశాలలో పిల్లల వర్క్ బుక్‌లను ఉపాధ్యాయులు దిద్దలేదని గుర్తించి, దాని నెపాన్ని డీఈవోపై నెట్టి, ఏకంగా డీఈవో కారులోనే హోం వర్కు పుస్తకాలను ఆయన వేసి, దిద్ది పంపి, వాట్సాప్‌తో తనకు షేర్ చేయాలంటూ ఆదేశిస్తారు. ఇవన్నీ ఆయనే సోషల్ మీడియాలో పోస్టు చేస్తారు. ఈ సంఘటనలు ఉపాధ్యాయులకు కొంత మంచిగాను, మరికొంత ఆందోళనకరంగానూ ఉంటున్నాయి. పాఠశాల విద్య పనితీరు మెరుగు కోసం ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ నిత్యం తనదైన శైలిలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. వాటిపై ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయుల్లో విభిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రవీణ్ చేస్తున్న ప్రయత్నాన్ని కొందరు స్వాగతిస్తూనే, మరోవైపు శృతి మించుతుందంటూ విమర్శిస్తున్నారు. ఆయనపై ఎవ్వరూ బహిరంగంగా వ్యాఖ్యలు చేసేంత సాహసం చూపడం లేదు. దీనికి కారణంగా ఆయన ఎక్కడకు తనిఖీలకు వెళితే, అక్కడ ఒకరికి క్లాస్‌గానీ, హెచ్చరికలు గానీ, చర్యలు గానీ ఉంటాయి. ఈ తరహా వ్యవహార శైలితో ప్రవీణ్ ఏ సమయంలో, ఏ పాఠశాలకు వస్తారో తెలియక ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. తుదకు విద్యాశాఖలోని ఎంఈఓల నుంచి డీఈవోల వరకు ప్రవీణ్ ప్రకాశ్ తనిఖీలతో బెంబేలెత్తుతున్నారు. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో వారిపై అదనపు భారం పడుతోంది. వాటి భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. ఆ దిశగా ప్రవీణ్ ప్రకాశ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం లేదనే విమర్శలున్నాయి.

ఆన్ లైన్‌లో పరీక్షల సన్నద్ధత తనిఖీలు: తాజాగా పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ తన కార్యాలయం నుంచి నేరుగా విద్యార్థులకు వాట్సాప్ వీడియో కాల్ చేస్తూ, నిర్మాణాత్మక అంచనా(ఎఫ్ ఏ)-1 పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసిన విధానంపై తనిఖీ చేస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నారు. విద్యార్థులు ఆంగ్లంలోనే పరీక్షలు రాయాలంటూ ప్రవీణ్ ప్రకాశ్ ఇచ్చిన ఆదేశాలు ఉపాధ్యాయులు, విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ఎఫ్ఏ-1 పరీక్షల కోసం విద్యార్థుల సన్నద్ధత, వర్క్ బుక్‌లను ఆన్ లైన్‌లో తనిఖీ చేస్తానంటూ మంగళవారం ఉదయం నుంచి ఆయన వీడియోలను విడుదల చేయడం ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తోంది. కంప్యూటర్ ర్యాండమ్ చెక్ ద్వారా ఏదో ఒక పాఠశాలను ఆయన ఎంపిక చేసుకుని, వీడియో కాల్ ద్వారా పరీక్షించారు. ప్రధానోపాధ్యాయులందరూ ఫోన్లలో అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశాలిచ్చారు. ఉపాధ్యాయులు పరీక్షల నిర్వహణలో ఉండగా, ప్రవీణ్ ప్రకాశ్ ఈ తరహాగా వాట్సాప్ వీడియో కాల్‌తో తనిఖీలు చేయడాన్ని తప్పుపడుతున్నారు. నిత్యం తనిఖీల పేరుతో ఉపాధ్యాయులను ప్రవీణ్ ప్రకాశ్ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కొద్ది లోపం కనిపించినా దానికి ఉపాధ్యా యులనే బాధ్యులను చేయడం తగదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. విద్య మెరుగు కోసం ప్రవీణ్ ప్రకాశ్ చేస్తున్న పనులు మంచివే అయినప్పటికీ, అవి శృతిమించుతున్నాయనే వాదనలున్నాయి.

ఎఫ్ఏ-1 పరీక్షల ప్రారంభం: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మాణాత్మక అంచనా (ఎఫ్ఏ-1) పరీక్షలు ప్రారంభమయ్యాయి. 6 ,7 ,8 తరగతుల విద్యార్థులకు ప్రతిరోజూ మధ్యాహ్నం 1.10 నుంచి సాయంత్రం 3.25 మధ్య రెండు పరీక్షల షెడ్యూలు ప్రకటించారు. మంగళవారం తెలుగు, మ్యాథ్స్, 2వ తేదీన హిందీ, జనరల్ సైన్స్, 3న సోషల్ స్టడీస్, ఇంగ్లీషు పార్ట్-ఏ, ఇంగ్లీషు పార్ట్-బి పరీక్షలను నిర్వహిస్తారు. 4వ తేదీన ఉర్దూ తదితర భాషల పరీక్ష జరుగుతుంది. 9, 10 తరగతుల విద్యార్థులకు ఉదయం 9.30 గంటల నుంచి 11.15 గంటల మధ్య రోజుకు రెండు పరీక్షలను నిర్వహిస్తారు. ఈ తరగతుల వారికి తొలి రోజు తెలుగు, మ్యాథ్స్, 2న హిందీ, జనరల్ సైన్స్, 3న సోషల్ స్టడీస్, ఇంగ్లీషు పార్ట్-ఏ, పార్ట్-బి, 4వ తేదీన ఉర్దూ తదితర భాషల వారికి పరీక్షలు కొనసాగుతాయి. ఈ పరీక్షలను ఆంగ్ల మాధ్యమంలోనే రాయాలనే నిబంధన విధించారు. ఈ నిర్మాణాత్మక పరీక్షల నిర్వహణలో ఉపాధ్యాయులు నిమగ్నమవ్వగా, అదే సమయంలో ప్రవీణ్ ప్రకాశ్ ఫోన్లు చేసి, నోటు పుస్తకాలను పరిశీలించడంతో విద్యార్థులు సైతం కొంత టెన్షన్‌కు గురవుతున్నారు.

సంపాదకీయం

క్షుద్ర రాజకీయాలు

హర్యానాలోని నూహ్ జిల్లాలో గత అర్ధరాత్రి చెలరేగిన మతోన్మాద చర్యలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. విశ్వహిందూ పరిషత్తు చేపట్టిన శోభ యాత్ర సమయంలో కలహాలు చెలరేగాయి. ఈ కలహాల్లో ఒక మసీదులోని ఇమాం తో సహా నలుగురు మరణించారు. మరణించిన వారిలో ఇద్దరు హోం గార్డులున్నారు. విచిత్రం ఏమిటంటే ఈ శోభా యాత్ర ప్రతి ఏటా జరిగేదే కానీ ఎప్పుడు అతి కలహాలకు దారి తీయలేదు. ఈ ఏడాది అక్కడ పనిగట్టుకుని మతబీజాలు నాటే పని ప్రయత్న పూర్వకంగా జరిగింది. పొరుగు రాష్ట్రమైన రాజస్థాన్ నుంచి కూడా ఆ ఊరేగింపు కోసం జనాన్ని తరలించారు. అందులో కొంతమంది చేతిలో ఆయుధాలు ఉన్నాయి. నూహ్ లో రగుల్కొన్న మత విద్వేషం గురుగ్రాంలోని సెక్టర్ 57 కూడా పాకింది. ఊరేగింపులో పాల్గొన్న వారు కాల్పులు జరిగారు. సాధారణంగా మతకలహాల సమయంలో తుపాకులు వాడడం అరుదు. అక్కడ గుమిగూడిన జనంలోని కొందరు మసీదులోకి కాల్పులు జరిపారు. ఆ తరవాత ఆ మసీదు తగుల బెట్టారు. మసీదు పూర్తిగా ధ్వంసం అయింది. అందులో ఉన్న మత గ్రంథాలు కూడా కాలి బూడిదై పోయాయి. ఈ విధ్వంస కాండలో గాయపడిన దాదాపు 30 మందిలో పదిమంది పోలీసులున్నారు. కనీసం 120 వాహనాలకు నిప్పు పెట్టారు. ఇందులోనూ దాదాపు 50 వాహనాలు పోలీసులవే. నూహ్ జిల్లాలో ముస్లింల జనసంఖ్య ఎక్కువ. ఈ వార్త తెలియగానే సోహ్నాలో నాలుగు వాహనాలకు, ఒక దుకాణానికి నిప్పు పెట్టారు. నూహ్‌లోనూ, ఇతర కీలక ప్రాంతాలలోనూ కర్ఫ్యూ విధించడం, 144వ సెక్షన్ అమలు చేయడం, సాయుధ దళాలను నియోగించడం యాంత్రికంగా జరిగిపోయాయి. ఇలాంటి సంఘటనలు నివరించడానికి హర్యానా ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు మనోహర్ లాల్ ఖట్టర్ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఈ సంఘటన జరిగిన చోట కేవలం లాఠీలు మాత్రమే చేతబూనే అవకాశం ఉన్న హోం గార్డులు మాత్రమే ఉన్నారు. పోలీసుల జాడ లేదు. విశ్వహిందూ పరిషత్ ఊరేగింపు నిర్వహించడానికి అనుమతి మంజూరు చేసి అక్కడి పోలీసు సూపరింటెండెంట్ ఆ ప్రాంతం నుంచి వెళ్లి పోయారు. ఆయన ఏం పని మీద వెళ్లినా సంఘటన జరిగిన చోట లేరన్నది వాస్తవం. జైపూర్ నుంచి ముంబై వెళ్తున్న రైలులో ఒక రైల్వే భద్రతా జవాను నడుస్తున్న రైలులోనే తన పై అధికారిని కాల్చి చంపిన సంఘటనను కూడా దేశంలో అలుముకున్న విద్వేష వాతావరణంతో విడదీసి చూడడానికి వీలులేదు. ఆ జవాను మరో ముగ్గురిని కూడా హతమార్చాడు. ఆ ముగ్గురూ ముస్లింలే కావడం, పై అధికారి గిరిజనుడు కావడం ప్రత్యేకంగా గమనించదగిన అంశాలే.

ఈ సంఘటనల వరస క్రమాన్ని చూస్తే ఎన్నికలు దగ్గర పడ్తున్న కొద్దీ మత కలహాలను రెచ్చగొట్టడం మొదలైందని తేలిపోతోంది. రాజకీయ పరమపద సోపానపటంలో మతవిద్వేషం అన్న పెద్ద నిచ్చెన ఎక్కి బీజేపీకేంద్రంలోనూ, కొన్ని రాష్ట్రాలలోనూ అధికారం సంపాదించిన మాటను కాదనలేం. దేశంలో వాతావరణం విష పూరితం అయినప్పుడు మతం ఆధారంగా రాజకీయాలు నడపడానికి అలవాటు పడ్డవారు కలహాలను రెచ్చగొట్టడంలో ఆశ్చర్యం లేదు.

నూహ్ జిల్లాలో శోభా యాత్ర సాగుతుండగా ఒక మందిరం దగ్గర కొంతమంది ముస్లిం యువకులు నిలబడి ఉన్నారు. అప్పుడు బిట్టూ బజరంగీ నేను మీ బావను వచ్చాను మర్యాద చేయరా అన్నారు. దీనితో కలహం ప్రారంభమైంది. నూహ్ లో కలహం చెలరేగడానికి ముందు దేవాలయంలో అయిదువేల మందిని పోగేశారు. ఆ గ్రామంలో ఊరేగింపు ప్రతి ఏటా జరుగుతుంది. కానీ ఈసారి చాలా భారీ స్థాయిలో ఊరేగింపు నిర్వహించారు. ఇది కూడా పనిగట్టుకుని చేసిన పనిలాగే కనిపిస్తోంది. నూహ్‌లో ఉన్న ముస్లింలకు గుణపాఠం చెప్పాలనుకున్నారు. గుజరాత్‌లో రెండు దశాబ్దాల కింద ఒక వర్గం వారికి గుణపాఠం నేర్పినందువల్ల అక్కడ ఇప్పుడు మతకలహాలు జరగడంలేదని కేంద్ర హోం మంత్రి బాహాటంగానే ప్రకటించారు. ఆ ఒక వర్గం వారెవరో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. మిగతా చోట్ల కూడా ఇదే పని చేసి పబ్బం గడుపుకోవాలని బీజేపీ కంకణం కట్టుకున్నట్టు స్పష్టం అవుతోంది. మణిపూర్‌లో కూడా క్రైస్తవుల పని పడ్తున్నాం కనక హిందువులు కిమ్మనకుండాఉండాలన్న సందేశం ఇస్తున్నారు. హర్యానాలో డబుల్ ఇంజన్ సర్కారు ఉందని గమనించాలి. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో త్వరలో ఎన్నికలు జరగాల్సి ఉంది. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో అధికారం సంపాదించగలమన్న విశ్వాసం బీజేపీకి ఎటూ లేదు. రాజస్థాన్‌లో గెలవొచ్చునన్న ఆశ బీజేపీలో మిణుకు మిణుకుమంటోంది. రాజస్థాన్ లో చెదురుమదురుగా చిన్న స్థాయిలో మత కలహాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. నూహ్‌కు రాజస్థాన్ నుంచి జనాన్ని తరలించడం కూడా గమనించాల్సిన అంశమే. మోనూ మానేసర్ అనే వ్యక్తి కూడా నూహ్ సంఘటనలు రెచ్చగొట్టా రంటున్నారు. ఆయన గోరక్ష దళం ఏర్పాటు చేశారు. ఆయన ఆయుధాలతో ఫొటోలు ప్రచారంలో పెడ్తూ ఉంటాడు. ఈ ఘటన జరగడానికి రెండు రోజుల ముందు నేను వస్తున్నాను సిద్ధంగా ఉండండి అని ఒక వీడియో ప్రచారంలో పెట్టాడు. సంఘటన జరిగిన చోట ముస్లింల జనాభా ఎక్కువ. ఇంతకు ముందు ఎదుర్కొన్న బెదిరింపులు, అనుభవించిన అవమానాలు వారిలో సహజంగానే ఆగ్రహం కలిగించి ఉండవచ్చు. వారు ప్రతీకారేచ్ఛతో రగిలి పోతున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా, ట్విట్టర్, అనుకూలమైన పత్రికల ద్వారా, వీడియోల ద్వారా ఉద్వేగాలు రెచ్చగొట్టే పని కొద్ది రోజులుగా కొనసాగుతూనే ఉంది. విద్యావంతుల, వివేకంగల వారు అనుకున్న వారి మెదళ్లలో కూడా విషబీజాలు నాటారు. ఆ విషం తలకెక్కించుకున్న వారు ముస్లిం వ్యతిరేకులుగా మారుతున్నారు. ఉత్తర భారతంలో ముస్లింల మీద, ఈశాన్య భారతంలో క్రైస్తవుల మీద సంఘ్ పరివార్ గురి పెట్టినట్టు అనేక సంఘటనలు రుజువు చేస్తున్నాయి. నిష్పక్షపాతంగా వ్యవహరించే పోలీసు అధికారులను సస్పెండ్ చేస్తున్నారు. బదిలీ చేస్తున్నారు. హర్యానా ముఖ్యమంత్రి తన పాలనా కాలంలో చెప్పుకోదగ్గ పనులేవీ చేయలేదు. గురుగావ్ పేరు గురుగ్రాంగా మార్చడం తప్ప. సమస్యల నుంచి జనం దృష్టి మళ్లించి మతకలహాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడం బీజేపీకి అలవాటైన వ్యవహారమే. ఆర్.పి.ఎఫ్. జవాను ప్రవర్తన కూడా మతోన్మాదం రెచ్చగొట్టడంలో ఒక వినూత్న పద్ధతిలా కనిపిస్తోంది. విద్వేష వాతావరణం సృష్టించడానికి దేశమంతా ప్రయత్నం జరుగుతోంది. సఫలం కాని చోట ఏదో ఒక పద్ధతిలో మత విద్వేషం రెచ్చగొడ్తున్నారు. కలహాలను ఆపలేని అదుపు చేయలేని అధికారులను బదిలీ చేయవచ్చు. సస్పెండ్ చేయవచ్చు. కానీ ఈ విద్వేషాన్ని పెంచి పోషించడానికి కంకణం కట్టుకున్న ప్రభుత్వాలకు ఎవరు గుణపాఠం నేర్పాలి. అధికారం ఉన్న ప్రజలు ఆలోచించవలసిన అంశం ఇది.

బీజేపీ పాలనలో బ్యాంకు మోసాలు రెట్టింపు

బీజేపీ నాయకత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం బడా కంపెనీలకు సహాయం చేయడంలోనే తలమునకలై ఉంది. ఎన్నికల బాండ్ల ద్వారా కంపెనీలు, కార్పొరేట్లు బీజేపీకి కావాల్సినన్ని విరాళాలు అందచేస్తున్నారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ, అనంతరం లోకసభకు జరగనున్న ఎన్నికల దృష్ట్యా అధికార పార్టీ విచ్చలవిడిగా నిధులను ఖర్చు చేస్తుంది. 2022-23 సంవత్సరంలో బడా కంపెనీలు, కార్పొరేట్లు తీసుకున్న 2.09 లక్షల కోట్లను రద్దు చేశారు. ప్రయోజనం పొందినవారంతా బీజేపీ కోసం ఎంతైనా ఖర్చుచేయగల పరిస్థితి ఉంది. మోదీ తొమ్మిదేళ్ల పాలనాకాలంలో బ్యాంకులకు చెల్లించవలసిన 14.49 లక్షల కోట్లను రిజర్వు బ్యాంకు ద్వారా రద్దు చేయించారు. దీనివల్ల బ్యాంకింగ్ వ్యవస్థ కుప్పకూలిపోయే దశకు చేరుకున్నది. అయితే ప్రభుత్వం బ్యాంకులకు నిధులను సమకూర్చి తిరిగి పట్టాలపై కెక్కించారు. 2014-15 నుంచి 2020-21 నాటికి తీసుకున్న రుణాలను చెల్లించకుండా ఉన్న 10.7 లక్షల కోట్లను రద్దు చేశారు. 2020-21లో 2,02,781 కోట్ల రూపాయలను రద్దు చేశారు. అలాగే 2021-22లో 1,74,966 కోట్లు రద్దు చేశారు. 2022-23లో రద్దుచేసిన బకాయిలు 2,09,110 కోట్లకు పెరిగాయి. 2023 మార్చి 31 నాటికి రద్దుచేసిన బకాయిల మొత్తం 14.9 లక్షల కోట్లకు పెరిగింది. తను అధికారానికి వస్తే, బకాయిల రద్దు వ్యవహారాన్ని నడవనివ్వబోనని మోదీ వాగ్దానం చేశారు. ముఖ్యమైన వాగ్దానాలేవీ ఆయన నెరవేర్చలేదు. 2013-15లో బ్యాంకు మోసాలు 4,306 కాగా, అవి 2021-22నాటికి 9,103 వేలకు పెరిగాయి. అంటే మోదీ కాలంలో బ్యాంకు మోసాలు రెట్టింపయ్యాయి. 2022-23 ఆర్థిక సంవత్సరం నాటికి బ్యాంకు మోసాలు మరింతగా పెరిగి 13,530కి చేరాయి. దాదాపు 49శాతం డిజిటల్ మోసాలు జరిగాయి. ఈ అంశాలు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తాయి. రుణాలు తీసుకుంటున్న మోసకారులు అధికారులతో కుమ్మక్కవుతున్నారు.

ఆర్థిక సంవత్సరం చివరినాటికి బ్యాలెన్స్ షీట్లను ప్రక్షాళన చేసేందుకు రద్దుచేస్తున్న రుణ బకాయిలు చాలా ఎక్కువగా ఉంటున్నాయి. పైగా రద్దుచేసే రుణాలకు నిరర్థక ఆస్తులని ఒక ముద్దుపేరు పెట్టారు. రుణాలు తీసుకున్నవారి నుంచి వసూలు చేసేందుకు అటు ప్రభుత్వంకానీ, ఇటు బ్యాంకులు కానీ పెద్దగా ఆసక్తి చూపించడంలేదు. దీనితో సామాన్య ప్రజలు, దిగువ, మధ్య తరగతి ప్రజలు కష్టపడి సంపాదించుకుని డిపాజిట్ల రూపంలో బ్యాంకుల్లో ఉంచిన మొత్తాలు బడా కార్పొరేట్లు, భారీ కంపెనీలకు దారాదత్తం చేస్తున్నారు. రుణ బకాయిలను రద్దుచేసిన తర్వాత బ్యాలెన్స్ షీట్లను సరిచేసుకుని మళ్లీ ఇలాంటి మోసకారులకే వేలకోట్ల రుణాలు అందచేస్తున్నారు. అయితే ఏఏ కంపెనీలకు ప్రభుత్వం రుణాలను రద్దు చేస్తుందనే అంశం కూడా ఎవరికీ తెలియదు. కంపెనీల, కార్పొరేట్ల పేర్లు తెలిసినప్పటికీ ప్రభుత్వం కనీసం పార్లమెంటుకు కూడా తెలియజేయకుండా ప్రజలను మోసగిస్తున్నది. మూడవపార్టీకి ఈ రుణాల వసూలు బాధ్యతను అప్పగించినప్పటికీ పెద్దగా ప్రయోజనం కలగడంలేదు. కోటి రూపాయలకుపైగా ప్రభుత్వరంగ బ్యాంకుల నుండి రుణాలు తీసుకుని ఎగవేసిన మోసకారుల జాబితాను ప్రభుత్వానికి రిజర్వుబ్యాంకు అందచేసింది. ప్రభుత్వం ఈ జాబితాను వెల్లడించలేదు. తిరిగి వసూలు చేయలేని ఎగవేతదారుల రికార్డులు మాత్రమే బ్యాంకులలో ఉంటాయి. ఎవరెవరు ఎంత ఎగవేసారనే వివరాలు బ్యాంకులకే తెలుస్తాయి. గత మూడేళ్లకాలంలో 1,09,186 కోట్ల రూపాయలు మోసకారుల నుంచి వసూలు చేసినట్లుగా ఆర్‌బీఐ తెలిపింది. ఈ మూడేళ్లలో రద్దుచేసిన మొత్తం 5,86,891 కోట్లు, రద్దుచేసిన రుణ బాకాయిలలో ఇది కేవలం 18.6 శాతం.

2022 డిసెంబరు నాటి ఆర్థిక సుస్థిరత నివేదిక ఇలా ఉంది. "కష్టాలనుంచి ఇంకా బైటపడలేదు." అని రిజర్వు బ్యాంకు హెచ్చరించింది. 2023 సెప్టెంబరు నాటికి బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులు 9.4శాతానికి పెరగవచ్చునని కూడా బ్యాంకు తెలిపింది. అలాగే ప్రైవేటు బ్యాంకులలో నిరర్థక ఆస్తులు 5.5శాతానికి పెరగనున్నాయి. విదేశీ బ్యాంకులలో నిరర్థక ఆస్తులు 4.1శాతానికి పెరిగాయని ఆర్‌బీఐ హెచ్చరించింది. 2023 జూన్ నాటికి ఆర్‌బీఐ తన ఆర్థిక సుస్థిరత నివేదికలో స్థూల ఆర్థిక పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉంటుందని కూడా నివేదిక వెల్లడించింది. అంతర్జాతీయంగా అంగీకృత నిరర్థక ఆస్తులు 1-2శాతం మాత్రమే ఉంటుంది. భారీ మొత్తాలను రద్దుచేసిన తర్వాత బ్యాంకు బాలెన్స్‌షీట్ల ప్రక్షాళన పూర్తయ్యాక బ్యాంకింగ్ రంగం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందిందని పెట్టుబడుల నిల్వజరిగిన కాలంలో కంటే నేడు అత్యున్నత స్థాయికి చేరిందని రిజర్వుబ్యాంకు చెప్పడం అత్యంత హాస్యాస్పదంగా ఉంది. ఖాతాదారులు బ్యాంకులను నమ్ముకుని డిపాజిట్లు చేస్తారు. బడా కార్పొరేట్లు, కంపెనీలకు కోట్ల రూపాయలు రద్దుచేసి వారినుండి వీలున్న మేరకు విరాళాల రూపంలో సహాయం పొందుతారు. ఇదంతా బహిరంగ రహస్యమే అయిపోయింది. బ్యాంకింగ్ వ్యవస్థ అసమర్థంగా దిగజారిపోయింది. ఇదంతా కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లోనే జరుగుతున్నది. నిరర్థక ఆస్తుల నిష్పత్తి చాలా ఎక్కువగా ఉంటోంది. లక్షల కోట్ల రుణ బకాయిలను రద్దు చేయడం వల్ల ఆర్థికవ్యవస్థ తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్న వాస్తవం మన కళ్లముందే ఉంది.

-ఎడిట్ పేజీ డెస్క్

నిజంచెప్పిన అధికారికి మోదీ ఉద్వాసన

జ్ఞాన్‌పాఠక్

> ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ సమాచారం అనేక విధాలుగా చాలా ప్రాధాన్యత కలిగింది. పేదరికం మోదీపాలనలో తగ్గిందని ఆయనప్రభుత్వం చెప్ప కుంటున్నప్పటికీ ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ సమాచారంనివేదిక పూర్తిగా వ్యతిరేకించింది. ఈ సమాచారాన్ని ప్రతిపక్షాలు రాజకీయంగా వినియోగించు కుంటే ప్రస్తుతం పరిపాలిస్తున్న మోదీ ప్రభుత్వ ప్రతిష్ట దిగజారిపోతుంది. మోదీ ప్రతిష్టకు కూడా దెబ్బతగులుతుంది. మానవ అభివృద్ధి విభాగంలోని మోదీ ప్రభుత్వం గొప్పగా సాధించిందేమీ లేదని నివేదిక తెలిపింది. పేదరికం తగ్గించానని, మానవ అభివృద్ధిలోనూ దేశం ముందుందని ప్రధాని మోదీ పదేపదే చెప్పకుంటారు.

ప్రామాణికమైన నివేదిక ఇచ్చిన అధికారికి ప్రధాని నరేంద్ర మోదీ ఉద్వాసన పలికారు. మోదీ ప్రభుత్వానికి అనుకూలంగాలేని, ఆయన ప్రతిష్ఠను దిగజార్చే వాస్తవ నివేదికను ఒక్కనాటికీ ఆయన ఆమోదించరు. తాజాగా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సైన్సెస్ (ఐఐపిఎస్) డైరెక్టర్ కెఎస్ జేమ్స్‌ను మోదీ సస్పెండ్ చేశారు. ఎందుకంటే ఆయనకు వాస్తవాలు నచ్చవు. అందుకనే అనేక అంశాలపై వాస్తవ నివేదికను మోదీ, బీజేపీలు తిరస్కరిస్తాయి. 2014లో అధికారం చేపట్టిన నాటినుంచి కూడా మోదీ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు. పైగా త్వరలో అయిదు రాష్ట్రాల అసెంబ్లీలకు, లోకసభకు ఎన్నికలు జరగనున్న తరుణంలో మోదీ ప్రభుత్వానికి ప్రామాణిక సమాచారం నచ్చదు. మోదీ తొమ్మిదేళ్ల పాలనాకాలంలో అన్ని రంగాలలో పరిస్థితి దారుణంగా ఉందనే అంశాన్ని వెలుగులోకి రానివ్వరు. క్షేత్రస్థాయిలో మోదీ సాధించింది ఏమీలేదని నివేదికిస్తే ఆయన ఊరుకుంటారా? జాతీయ కుటుంబ, ఆరోగ్య సర్వేలకు(ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్) సాంకేతిక మార్గదర్శకాన్ని అందించడం, సమన్వయ పరచడానికి నోడల్ ఏజన్సీగా ముంబై నుండి ఐఐపిఎస్ పనిచేస్తుంది. ఈ నోడల్ ఏజన్సీ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ పరిధిలో ఐఐపిఎస్ పనిచేస్తుంది. ప్రస్తుతం ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-6 2023-24కి సంబంధించిన సమాచారం క్రోడీకరిస్తున్నారు. 2024లో జరుగ నున్న లోకసభఎన్నికలకు ముందు వాస్తవమైన సమాచారంతో కూడిన నివేదికను ప్రభుత్వానికి అందచేయడంతోపాటు పుస్తకరూపంలో ప్రచురిస్తుంది. వాస్తవ సమాచారాన్ని అణచివేసేందుకే ఐఐపిఎస్ డైరెక్టర్‌ను సస్పెండ్ చేశారు. 2018లోనూ ఇలాంటి సమాచారాన్నే క్రోడీకరించారు. 2019 లోకసభ ఎన్నికలకు ముందు నిరుద్యోగానికి సంబంధించిన వాస్తవ సమాచారం నివేదికను ఐఐపిఎస్ ప్రచురించడంతో గగ్గోలు పుట్టింది. అంతవరకు ప్రభుత్వం ఈ సమాచారం వెలుగులోకి రాకుండా అణచివేసింది. మీడియాద్వారా దేశంలో నిరుద్యోగం గత 45ఏళ్ల కాలంలో ఏనాడూ ఇంత అధికంగా లేదని ఆ నివేదిక వెల్లడించింది. దీనితో అప్పుడు కూడా జాతీయ గణాంక కమిషన్ సభ్యులు, ఈ సంస్థ చైర్మన్ పిసి.మోహనన్ రాజీనామా చేయవలసి వచ్చింది.

ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ సమాచారం అనేక విధాలుగా చాలా ప్రాధాన్యత కలిగింది. పేదరికం మోదీపాలనలో తగ్గిందని ఆయనప్రభుత్వం చెప్పు కుంటున్నప్పటికీ ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ సమాచారంనివేదిక పూర్తిగా వ్యతిరేకించింది. ఈ సమాచారాన్ని ప్రతిపక్షాలు రాజకీయంగా వినియోగించు కుంటే ప్రస్తుతం పరిపాలిస్తున్న మోదీ ప్రభుత్వ ప్రతిష్ట దిగజారిపోతుంది. మోదీ ప్రతిష్టకు కూడా దెబ్బతగులుతుంది. మానవ అభివృద్ధి విభాగంలోని మోదీ ప్రభుత్వం గొప్పగా సాధించిందేమీ లేదని నివేదిక తెలిపింది. పేదరికం తగ్గించానని, మానవ అభివృద్ధిలోనూ దేశం ముందుందని ప్రధాని మోదీ పదేపదే చెప్పుకుంటారు. క్షేత్రస్థాయిలో పరిశీలన మాత్రమే వాస్తవాన్ని బైటపెట్టగలదు. 2014లో మోదీ అధికారం స్వీకరించడానికి ముందు నిరుద్యోగులందరికీ గౌరవనీయమైన ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల ప్రచారసభల్లో అనేక పదులమార్లు హామీ ఇచ్చారు. అయినప్పటికీ 2018 ప్రారంభంనాటికే 45ఏళ్ల కాలంలో ఏనాడూలేని నిరుద్యోగం 6.1శాతానికి పెరిగింది. అందువల్లనే ఆనాడు నిరుద్యోగానికి సంబంధించిన వాస్తవ గణాంకాలను మోదీ ప్రభుత్వం బైట పెట్టలేదు. ప్రస్తుతం నిరుద్యోగిత రేటు 7-8.4శాతానికి అటుఇటూగా నడుస్తోంది. అలాగే ద్రవ్యోల్బణం, రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువులతోపాటు అనేక వస్తువుల, పరికరాల ధరలు పెరిగి జీవనవ్యయం మెజారిటీ ప్రజలను సంక్షోభంలోకి నెట్టింది. ఈ సంక్షోభంలో 142కోట్ల జనాభాలో 97.6కోట్ల మంది చిక్కుకుని గిజగిజలాడుతున్నారు. వీరు కనీసం ఆరోగ్యకరమైన ఆహారాన్ని కూడా తినలేకపోతున్నారు. ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక ఈ విషయాలను ధృవీకరించింది. పేదలు, అణగారిన వర్గాల ప్రజలకు ఆరోగ్యరక్షణ అత్యంత ఖరీదైపోయింది. ఈ దారుణ పరిస్థితులు కేంద్ర ప్రభుత్వాన్ని భయాందోళనకు గురిచేస్తున్నాయి. అందువల్ల ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-6కు సంబంధించిన నివేదికలో ప్రభుత్వం చెప్పేవన్నీ అబద్ధాలని పూర్తిగా బైటపెడుతుంది. పేదరికానికి సంబంధించి వాస్తవ సమాచారాన్ని 2011-12 జాతీయ గణాంకాల సంస్థ తరువాత ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ మాత్రమే వెల్లడించగలదు. నివేదికకు పూర్తి భిన్నంగా అసలు పేదరికమే దేశంలో లేదన్నట్లుగా మోదీ, ఇతర బీజేపీ అగ్రనాయకులు ప్రచారం చేసుకుంటున్నారు. ఇటీవల ప్రపంచఆర్థికసంస్థ(ఐఎమ్‌ఎఫ్) విడుదల చేసిన పత్రంలోనూ ప్రభుత్వం వెల్లడించిన సమాచారంతో పూర్తిగా విభేదించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వెల్లడయ్యే ఏ సమాచారాన్ని అయినా ప్రభుత్వం అంగీకరించదు. ప్రభుత్వానికి అవసరమైన గణాంకాలను మాత్రమే ప్రచారం చేస్తుంది. కొవిడ్-19 మహమ్మారికి బలైన వారి సంఖ్యను సైతం వాస్తవాలకు భిన్నంగా బైటకు వెల్లడించింది. ప్రపంచఆరోగ్యసంస్థ భారతదేశంలో 48లక్షల మంది కరోనా మహమ్మారికి ప్రాణాలు వదిలారని ప్రకటించింది. అయితే మోదీప్రభుత్వం మాత్రం 5లక్షలమంది మాత్రమే మృతిచెందారని ప్రకటించింది.

ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ విషయంలో ఐసిఆర్(అమెరికా) ఇంకా ఇతర సంస్థలు నిర్దిష్టమైన అంశాలపై సాంకేతిక సహకారం అందించిందని కూడా మనం గుర్తుపెట్టుకోవాలి. ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ దఫదఫాలుగా సమాచారాన్ని సేకరించ డానికి ఇఎఫ్‌ఏఐడి, డిఎఫ్‌ఐడి బిల్, మిలిందా గేట్స్ ఫౌండేషన్, యుఎన్‌ఐసి ఇఎఫ్, యుఎన్‌ఎఫ్‌పిఏ అలాగే భారత ప్రభుత్వసంస్థ ఆర్థికసహాయాన్ని అందించాయి. వాస్తవ గణాంకాలను తిరస్కరించి ప్రభుత్వం తనకు అవసరమైన సమాచారాన్ని మాత్రమే వెల్లడించడానికి కూడా కొన్ని సమయాల్లో వీలుకాదు. అందువల్ల కేంద్ర ప్రభుత్వం వాస్తవాలను 2024 ఎన్నికలకు ముందు వెల్లడించకుండా ఆ తరువాత వెల్లడిస్తుంది. డైరెక్టర్ జేమ్స్‌ను సస్పెండ్ చేయడం శిక్ష విధించడం కాదని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ప్రకటించింది. ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్‌లో అవకతవకలు జరిగాయని, వాటిపై న్యాయంగా విచారణ జరిపేందుకే ఈ పనిచేశామని ఆ శాఖ తెలిపింది. తమను ఇబ్బందిపెట్టే సమాచారాన్ని సేకరించడంవల్ల రాజీనామా చేయవలసిందిగా జేమ్స్‌నుకోరగా అందుకు ఆయన తిరస్కరించి నట్లు వార్తలు వచ్చాయి. తిరస్కరించడం వల్లే సస్పెన్షన్ చేసినట్లుగా కూడా తెలుస్తోంది.

దేశంలో మహిళలు, బాలికల్లో రక్తహీనత పెరిగిపోతోందని ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-5(2019-21) నివేదిక తెలిపింది. వీరికి ఆరోగ్యకరమైన ఆహారం లభించడంలేదని పేర్కొన్నది. ఈ గణాంకాలు చూసినప్పుడు దేశంలో పేదరికం తగ్గిందని ఎలా చెబుతారు? దేశంలో బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన ఎక్కడాలేదని భారతప్రభుత్వం చెప్పే అవకాశమేలేదని ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-5 పేర్కొన్నది. ఒకవేళ మరుగుదొడ్లు ఉన్నా నీటి సరఫరాలేక 19శాతం ప్రజలు వాటిని ఉపయోగించడంలేదు. ఒక్క లక్షద్వీప్ తప్పితే ఏ రాష్ట్రంగానీ, కేంద్రపాలిత ప్రాంతంగానీ నూటికి నూరుశాతం మరుగుదొడ్లను ఉపయోగించే రాష్ట్రాలు లేవు. హెచ్‌ఐవి, మహిళల అక్రమరవాణా, ఆర్థికవృద్ధి, గృహవినియోగం, వాతావరణ సమాచారం తదితర రంగాలలోనూ అసలు వాస్తవాలను మోదీ ప్రభుత్వం దాచిపెడుతున్నదని తెలిసిందే.

పాలకుల పాపం మణిపూర్ కల్లోలం

డాక్టర్ రజని

అసలు మణిపూర్‌లో ఏమి జరుగుతోంది? రాష్ట్రంలోని కుకీలు, 70శాతం ప్రజలు ఎందుకు తమకు ప్రత్యేక పాలన కావాలని కోరుకుంటున్నారు.? మెయితీలు, ప్రభుత్వం ఎందుకు ప్రాంతీయ పాలనా ప్రాంతం కావాలంటున్నారు? ఈ ఘర్షణల్లో మహిళలు ఎక్కువగా ఎందుకు బలి అవుతున్నారు.? మెయితీలకు ఎస్‌టీ స్టేటస్ ఇవ్వడం ఎంతవరకు సమంజసం? కుకి ప్రజలు మన దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని ప్రాణాలు విడిచిన వారు చాలామంది ఉన్నారు. ఐఎన్‌ఏ మెమోరియల్ దగ్గరచూస్తే ఎంతోమంది కుకీస్ పేర్లు ఉంటాయని ది వీక్ పత్రికలో ఒక లాయరు పేర్కొన్నారు. అలానే ఒక వర్గాన్ని అస్సాం రైఫిల్స్ రక్షిస్తుంటే, మరో వర్గాన్ని మణిపూర్ పోలీసులు రక్షిస్తున్నారని తెలుస్తోంది. అంటే ఒక వర్గం ఎక్కువగా ఉండే ప్రదేశంలో మరో వర్గం ప్రజలు వెళ్లి పనిచేసుకోవాలి అంటే భయాన్ని కల్పిస్తున్నది ఎవరు? కుకీల గ్రామంలో ఉన్న మెయితీల కుటుంబాలని కుకీలు రక్షిస్తున్నారని అక్కడ మెయితీ కుటుంబాలు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలోని ప్రస్తుత మారణహోమాన్ని రగిలిస్తున్నదెవరు? ప్రోత్సహిస్తున్న దెవరు? దీనిపై ప్రజలు ఒక అవగాహనకు రావాల్సిన అవసరం ఉంది. అంటే ప్రభుత్వం, ప్రజా ప్రతినిధుల మధ్య సఖ్యత నెలకొనాలి. మణిపూర్ యువతకి ఏకే 47 రైఫిల్స్ కాదు కావలసింది జీవించడానికి ఉపాధి. మణిపూర్‌లో ఎంతోమంది మహిళలు, పిల్లలు వారి భర్తలను, తల్లులను, పిల్లలను పోగొట్టుకొని విలపిస్తున్న దారుణ పరిస్థితి నెలకొంది. అమ్మాయిలపై లైంగిక దాడులు వీటిపై ప్రభుత్వ నియంత్రణలేదా? పరిష్కారాలు చూపడంలేదా అంటే లేదు. ఏకే47 తుపాకులు, మారణ ఆయుధాలు అమ్మకాలపై రాష్ట్రంలో నియంత్రణ లేదా? గ్రామ రక్షణ కమిటీలు వారి ప్రజలను రక్షించుకోడానికి ఆయుధాలను ఎక్కువ ధరలుపెట్టి కొనవలసిన అవసరం ఎందుకు వచ్చింది. ఇది ప్రభుత్వ వైఫల్యం కాదా? అంటే ముమ్మాటికీ ప్రభుత్వాల వైఫల్యమే.

వీటన్నింటికీ కారణాలు మణిపూర్‌లోని ప్రస్తుత ప్రభుత్వ దుష్ట ఎత్తుగడలు కాదా! మణిపూర్‌లో కుకీస్, జోలు ఎప్పటినుంచో ఉన్నారు. లోయకి ఒక ప్రక్క కుకీలు, మరోపక్క నాగాలు. గిరిజనులైన నాగాలు కొండ ప్రాంతాలలో దొరికిన వనరులతో జీవనం సాగిస్తున్నారు. కొండ ప్రాంతాలలో వీరికి విద్య, వైద్యం వంటి సదుపాయాలు లేవు. అన్ని ప్రాంతాలలో వలెనే క్రిస్టియన్ మిషనరీలు కొండ ప్రాంతాల్లో తగిన సదుపాయాలు కల్పించడంతో వారిలో కొంతమంది క్రిస్టియన్స్‌గా మారారు. మెయితీలు ఎక్కువగా ఉన్న లోయప్రాంతం బాగా సారవంతమైనది. అక్కడ వీరికి ఇంచుమించు అన్నిసదుపాయాలు ఉన్నాయి. కుకీస్ కొంతమంది ఇక్కడకు వచ్చి పనులు చేసు కోవడంతో రెండు పక్షాల మధ్య చిన్న చిన్న ఘర్షణలు చోటుచేసుకున్నాయి.

మణిపూర్‌లోని కొండ ప్రాంతంలో ఖనిజ నిక్షేపాలు ఎక్కువగా ఉన్నాయి. గిరిజన హక్కుల చట్టం కింద ఎవ్వరూ ఆ ప్రాంతాన్ని అమ్మడానికి, కొనడానికి హక్కు లేదు. కొండప్రాంతాల్లో చొరబడి వారిస్థలాలను ఆక్రమించుకునే హక్కు ఎవరికీ లేదు. ఈ పరిస్థితుల్లో మెయితీలకి ఎస్‌టీ హోదా ఇవ్వడానికి పరిశీలించాలని హైకోర్టు చెప్పడంలో అర్థంఏమిటి? మెయితీలకు ఎస్‌టీ హోదా ఇచ్చి కుకీల కొండప్రాంతాన్ని ఆక్రమించి, కార్పొరేట్స్‌కి అప్పనంగా భూమిని అప్పచెప్పవచ్చు అనేది రాష్ట్రప్రభుత్వ యోచన. ఈ దురుద్దేశంతోనే రెండు గ్రూపుల మధ్య మరణహోమానికి ప్రభుత్వం ఆజ్యం పోసింది. కొండ ప్రాంతం లోని క్రిస్టియన్స్‌ను హిందువులుగా మార్చాలన్న ప్రభుత్వ యోచనతోపాటు వారిని ఎలా హతమార్చాలి అనేది రాష్ట్రప్రభుత్వ ఆలోచన. అనాదిగావస్తున్న పితృస్వామ్య భావజాలం, మనువాద భావజాలం స్త్రీని దేవతఅని చెప్పేవారే స్త్రీని ఒక వ్యాపారవస్తువుగా పరిగణించడం పరిపాటైంది. ఆర్థిక అసమానతలు, కుల వివక్ష, మతం మత్తు, ఆర్థికదోపిడీని నిర్మూలించకుండా సమసమాజ స్థాపనకు ప్రయత్నించకుండా ఉన్నంతకాలం దళితులు, మైనార్టీలు, స్త్రీలు, గిరిజనులు అందరూ ఇటువంటి సమస్యలను అనుభవిస్తూనే ఉంటారు. ప్రస్తుతం ఈ పరిస్థితులను ఎదుర్కొని ప్రజలు పోరాడవలసిన తరుణం ఆసన్నమైంది.

రాష్ట్రంలో ఓ పక్క మహిళలపై అత్యాచారాలు చేసి వీధుల్లో నగ్నంగా ఊరేగిస్తుంటే, మరోపక్క ప్రధానమంత్రి దేవాలయం లాంటి పార్లమెంటు ముందు మొసలి కన్నీరు కార్చి ఇలాంటి ఘటనలు చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, బెంగాల్‌లో జరిగాయి అనడం శోచనీయం. స్త్రీలపై జరిగిన అత్యాచారాలను కూడా రాజకీయాలకు వాడుకోవడం మనపాలకుల అవినీతికి నిదర్శనం. మణిపూర్‌లో మూడునెలలుగా జరుగుతున్న మారణహోమంపై ప్రధాని ఇప్పటికీ స్పందించకపోవడం ఎంత వరకు సమంజసం? గుజరాత్‌లో బిల్కిస్‌బానోపై అత్యాచారం చేసి, కుటుంబ సభ్యులను హత్యచేసి కిరాతకులను జైలునుండి విడుదల చేసిన తర్వాత వారిని సత్కరించిన ఘనత మనది. నిజానిజాలు తెలుసుకొని మత విద్వేషాలు రాకుండా మత సామరస్యాన్ని కల్పించవలసిన బాధ్యత దేశ ప్రధానిది, ప్రజా ప్రతినిధులది. మహిళలపై అత్యాచారాలు, అరాచకాలు జరగకుండా కఠినమైన శిక్షలు విధించాలి.

ప్రజలను రెచ్చగొట్టే రాజకీయ అజెండాలు మాను కోవాలి. మణిపూర్ ప్రజలలో 40మంది ఎంఎల్‌ఏలు మెయితీలు కాగా, 10మంది కుకీలు, జోలు ఉన్నారు. మహిళలందరూ కలిసి ఈ మనువాద, పితృస్వామ్య భావజాలాన్ని ఎదుర్కొవాలి. ఎవరిహక్కులు వారు కాపాడు కోవడానికి పోరాడాలి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటి కైనా మణిపూర్ సమస్యను పరిష్కరించాలి. అన్ని పార్టీలు కలిసి మణిపూర్‌ను రక్షించుకోవలసిన బాధ్యత ఉంది.

ఈ పరిస్థితుల్లో మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమం నిజానిజాలు తెలుసుకోవడానికి అక్కడికి వెళ్లిన ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు ప్రధాన కార్యదర్శి అనీ రాజా, జాతీయ కార్యదర్శి నిషా సింధు, అడ్వకేట్ దీక్ష ద్వివేదీలపై ఫైల్ చేసిన ఎఫ్‌ఐఆర్ వెంటనే ఉపసంహరించుకోవాలి.

మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

- కార్మికులపై గిర్డర్ యంత్రం పడి 20 మంది మృతి
- థానే జిల్లాలో సమృద్ధి ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణ పనుల్లో ఘటన
- రూ.2 లక్షల పరిహారం ప్రకటించిన మోదీ, రూ.5 లక్షలు ప్రకటించిన సీఎం షిండే

ముంబై: మహారాష్ట్రలో ఘోర ప్రమాదం సంభవించింది. థానే జిల్లాలో సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వే కోసం వయాడక్ట్ నిర్మాణంలో మంగళవారం గిర్డర్ లాంచర్ కూలిపోవడంతో 10 మంది కూలీలు సహా కనీసం 20 మంది మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడినట్లు అధికారులు తెలిపారు. లాంచర్ గిర్డర్‌తో పాటు 700 టన్నుల బరువున్న సెగ్మెంట్ లాంచర్ (క్రేన్) 35 మీటర్ల ఎత్తు నుంచి కూలిపోవడంతో ముగ్గురు కార్మికులు చిక్కుకుపోయారని మహారాష్ట్ర స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఎస్ఆర్‌డీసీ) విడుదల చేసిన ఒక ప్రకటన పేర్కొంది. ఆటోమేటిక్ లాంచర్‌ను తొలగించడానికి 'యుద్ధ ప్రాతిపదికన' ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాగా, మృతుల్లో 10 మంది కార్మికులు, ఇద్దరు ఇంజనీర్లు, ఐదుగురు ఉద్యోగులు ఉన్నారని ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టు కార్యనిర్వాహక సంస్థ ఎంఎస్ఆర్‌డీసీ తెలిపింది. సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వే మూడో దశ నిర్మాణ సమయంలో వంతెన స్లాబ్‌పై క్రేన్ పడిపోయిందని ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి ఒకరు గతంలో చెప్పారు. థానే జిల్లాలో గిర్డర్ లాంచర్ కూలిన ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంతో మరణానికి కారణమైన ఇద్దరు కాంట్రాక్టర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. ముంబైకి 80 కిలోమీటర్ల దూరంలోని థానే జిల్లాలోని షాహాపూర్ తహసీల్‌లోని సర్లాంబే గ్రామంలో సోమవారం అర్ధరాత్రి ఈ దుర్ఘటన జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారని, వారు థానేలోని కాల్వ వద్ద ఉన్న ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని ఎంఎస్ఆర్‌డీసీ అధికారి తెలిపారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ విచారం వ్యక్తం చేస్తూ, ఘటనపై నిపుణులతో విచారణకు ఆదేశించామని ట్వీట్ చేశారు. ఇది వంతెన నిర్మాణంలో, హైవే నిర్మాణ ప్రాజెక్టులలో ప్రీకాస్ట్ బాక్స్ గిర్డర్‌లను వ్యవస్థాపించడానికి ఉపయోగించే ఒక ప్రత్యేక ప్రయోజన మొబైల్ గ్యాంట్రీ క్రేన్. 'కుప్పకూలిన సెగ్మెంట్ లాంచర్ (క్రేన్) తో పాటు లాంచర్ గిర్డర్ 700 టన్నుల బరువు కలిగి ఉంది. ఇది సర్లాంబే గ్రామంలో సమృద్ధి మహామార్గ్‌పై వయాడక్ట్ నిర్మాణ సమయంలో 35 మీటర్ల ఎత్తు నుంచి సేకరించడం జరిగింది' అని ఎంఎస్ఆర్‌డీసీ పేర్కొంది. లాంచర్ కూలిన ఘటనపై సాంకేతిక నిపుణుల సహాయంతో విశ్లేషణ జరుగుతోందని తెలిపింది. మరుసటి రోజు సన్నాహక పనిలో భాగంగా, వయాడక్ట్ పీర్ నంబరు 15-16 మధ్య లాంచర్‌ను మార్చుతున్నప్పుడు కూలిపోయిందని ఆ ప్రకటన తెలిపింది. 2.28 కి.మీ పొడవున్న ఈ వయాడక్ట్‌ను అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నవయుగ ఇంజినీరింగ్, సింగపూర్‌లోని వీఎస్ఎల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్మాణం చేస్తున్నాయి. వయాడక్ట్ మొత్తం 114 విభాగాలలో, 98 ఈ లాంచర్‌ను ఉపయోగించి విజయవంతంగా నిర్మాణం చేసినట్లు ఎంఎస్ఆర్‌డీసీ పేర్కొంది. కూలిపోయిన ఘటనలో ప్రాణనష్టం జరిగినందుకు ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. మరణించిన ప్రతి కుటుంబానికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వ్యక్తులకు రూ.50 వేల సహాయాన్ని ప్రకటించారు. 'మహారాష్ట్రలోని షాహాపూర్‌లో జరిగిన ఘోర ప్రమాదం బాధ కలిగించింది. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి' అని ప్రధాన మంత్రి కార్యాలయం ట్వీట్ చేసింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా సంతాపం వ్యక్తం చేశారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నాయని చెప్పారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే మంగళవారం థానే జిల్లాలోని షాహాపూర్‌లో జరిగిన క్రేన్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల సాయం ప్రకటించారు. గాయపడిన వారికి రాష్ట్ర ప్రభుత్వ ఖర్చుతో సరైన చికిత్స అందించాలని ఆదేశాలు జారీ చేశారు. వంతెన నిర్మాణ పనుల్లో నిమగ్నమైన ఇద్దరు కాంట్రాక్టర్లపై షాహాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదయింది. సమృద్ధి మహామార్గ్, హిందూ హృదయసామ్రాట్ బాలాసాహెబ్ థాకరే మహారాష్ట్ర సమృద్ధి మహామార్గ్ అని పేరు పెట్టారు. ఇది ముంబై-నాగ్‌పూర్‌ను కలుపుతూ 701 కి.మీ-పొడవు ఎక్స్‌ప్రెస్ వే. ఇది నాగ్‌పూర్, వాషిం, వార్ధా, అహ్మద్‌నగర్, బుల్ధానా, ఔరంగాబాద్, అమరావతి, జల్నా, నాసిక్, థానేతో సహా 10 జిల్లాల గుండా ప్రయాణిస్తుంది. సమృద్ధి మహామార్గ నిర్మాణాన్ని మహారాష్ట్ర స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్వహిస్తోంది. నాగ్‌పూర్‌ని ఆలయ పట్టణం షిర్డీకి అనుసంధానించే మొదటి దశను డిసెంబరు 2022లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఇది 520 కి.మీ. ఇగత్‌పురి తాలూకాలోని భర్వీర్ గ్రామం నుంచి షిర్డీ వరకు సమృద్ధి మహామార్గం 80 కి.మీ. రెండవ దశను ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎం ఫడ్నవీస్ మే 26న ప్రారంభించారు. మూడవ, చివరి దశ ఈ సంవత్సరం డిసెంబరు చివరి నాటికి పూర్తవుతుందని షిండే మేలో చెప్పారు. ఇదిలాఉండగా, సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేపై గత ఆరు నెలల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 88 మంది ప్రాణాలు కోల్పోయారని, డివైడర్‌ను ఢీకొని ప్రైవేట్ బస్సు మంటల్లో చిక్కుకోవడంతో గత నెల 25 మంది మరణించారని అధికారి ఒకరు తెలిపారు.

మతం పేరుతో హింసను సహించలేం

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే

న్యూఢిల్లీ: 21వ శతాబ్దపు భారతదేశంలో మతం పేరుతో హింసను సహించలేమని, ఇలాంటి విభజన అంశాలకు వ్యతిరేకంగా ప్రజలు ఏకం కాకపోతే రాబోయే తరాలు దాని పర్యవసానాలను చవిచూడాల్సి వస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే మంగళవారం అన్నారు. 'హరియానాలోని కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్నది లేదా ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ చేసిన పని భారతమాత హృదయానికి లోతైన గాయం లాంటిది' అని తెలిపారు. ఇలాంటి సంఘటనలు 'బలహీనమైన' శాంతిభద్రతల పరిస్థితి, మన 'బలహీనమైన' రాజ్యాంగ సంస్థలపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని ఖడ్గే అన్నారు. శాంతి భద్రతలు కాపాడాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. 'భారతదేశంలో 21వ శతాబ్దంలో మతం పేరుతో వ్యాప్తి చెందుతున్న హింస మన నాగరికతకు, అన్ని మతాల సమానత్వ పునాదికి దెబ్బ. దీన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించలేం' అని అన్నారు. 'ఈ రోజుల్లో సమాజ నిర్మాణంలో కనిపించే విచ్ఛిన్న ధోరణి, అధికారం కోసం దురాశతో సమాజంలో ద్వేషాన్ని వ్యాప్తి చేయడం ఫలితం' అని ఆయన అన్నారు. ప్రజల్లో శత్రుత్వం అనే విషాన్ని కలపడం, ఒకరితో ఒకరు గొడవ పెట్టుకోవడం మన రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడం లాంటిదని తెలిపారు. 'ఈ రోజు మనం ఐక్యంగా ఈ విభజన అంశాలకు వ్యతిరేకంగా మన గళాన్ని పెంచకపోతే, రాబోయే తరాలు దాని పర్యవసానాలను భరించవలసి ఉంటుంది' అని అన్నారు. '... ద్వేషాన్ని విడిచిపెట్టండి. భారతదేశాన్ని ఏకం చేయండి' అని ఖడ్గే హిందీలో ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. సోమవారం వీహెచ్‌పీ ఊరేగింపును అడ్డుకునే ప్రయత్నంలో చెలరేగిన హింసాకాండలో నలుగురు మరణించగా, అనేక మంది గాయపడ్డారు. గురుగ్రామ్‌లోని సెక్టార్ 57 ప్రాంతంలో మంగళవారం తెల్లవారుజామున ఒక మసీదుకు నిప్పు పెట్టారు. ఇది ఒక ఇమామ్ మరణానికి దారితీసింది. హరియానాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలనుకునే వ్యక్తి కర్ఫ్యూ విధించిన నుహ్‌లో హింసను ప్రేరేపించాడని హోం మంత్రి అనిల్ విజ్ తెలిపారు.

ఆజాద్‌పూర్ మండీలో రాహుల్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఢిల్లీలోని ఆజాద్‌పూర్ మండికి వెళ్లారు. ఇది దేశంలోనే అతిపెద్ద కూరగాయల హోల్‌సేల్ మార్కెట్. అక్కడ కూరగాయలు, పండ్ల వ్యాపారులు, స్థానికులతో రాహుల్ ముచ్చటించారు. ఈ సందర్భంగా కూరగాయల ధరలపై రాహుల్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాహుల్ గాంధీ గత శనివారం తన అధికారిక ట్విటర్ ఖాతాలో ఆజాద్‌పూర్ మార్కెట్‌కు సంబంధించిన ఓ వీడియోను పంచుకున్న తర్వాత ఈ ఆకస్మిక పర్యటన చోటు చేసుకుంది. ఆయన పంచుకున్న వీడియోలో ఓ వ్యక్తి కన్నీటి పర్యంతమైన దృశ్యం కనిపిస్తోంది. 'దేశాన్ని రెండు వర్గాలుగా చీల్చారు. ఒకవైపు అధికారాన్ని కాపాడుకునేవారు, మరోవైపు సాధారణ వ్యక్తి. ఎవరి సలహాలతో దేశ విధానాలను రూపొందిస్తున్నారు. కూరగాయలు, నిత్యావసరాలు కనీస ధరలలో కూడా సామాన్యులకు అందడం లేదు. పేద, ధనిక వర్గాల మధ్య తారతమ్యం లేకుండా చూడాలి. సామాన్యుల కన్నీళ్లను తుడవాలి' అని రాహుల్ పేర్కొన్నారు. ఇటీవల రాహుల్ హరియాణాలోని సోనిపట్ రైతులతో సమావేశమైన విషయం తెలిసిందే. మదీనా గ్రామంలోని ఓ పొలంలో రాహుల్ ట్రాక్టర్‌తో దున్నారు. ఆ తర్వాత కూలీలతో కలిసి నాటు వేసి, వారితో కలిసి భోజనం చేశారు. ఢిల్లీలోని కరన్‌బాగ్‌లో మెకానిక్‌లను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. తాజాగా ఆజాద్‌పూర్ మండికి వెళ్లి అక్కడ కూరగాయల ధరలు అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను కాంగ్రెస్ పార్టీ పంచుకుంది.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

- సీఎం బీరేన్ సింగ్ రాజీనామా చేయాలి
- తక్షణమే మోదీ, కేంద్ర మంత్రులు సందర్శించాలి
- రాష్ట్రపతి ముర్ముకు నివేదించిన ఢిల్లీ మహిళా కమిషన్

న్యూఢిల్లీ: మణిపూర్‌లో అత్యవసరంగా రాష్ట్రపతి పాలన విధించాలని, రాష్ట్రంలో జరిగిన ఘర్షణలపై దర్యాప్తు చేసేందుకు సుప్రీం కోర్టు పర్యవేక్షణలో సిట్‌ను ఏర్పాటు చేయాలని ఢిల్లీ మహిళా కమిషన్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపిన మధ్యంతర సిఫార్సుల నివేదికలో పేర్కొంది. డీసీడబ్ల్యూ అధ్యక్షురాలు స్వాతి మలివాల్ గత వారం మణిపూర్‌లో మే నుంచి రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన జాతి హింస నుంచి బయటపడిన వారితో సంభాషించారు. 'రెండు వర్గాల మధ్య హింస, ధ్రువీకరణ పరిధిని దృష్టిలో ఉంచుకుని, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 ప్రకారం రాష్ట్రపతి పాలనను తక్షణమే రాష్ట్రంలో విధించాలి. రెండు వర్గాలూ విశ్వసించగల తటస్థ వ్యక్తులచే పరిపాలన నిర్వహించాలి' అని నివేదిక పేర్కొంది. మధ్యంతర సిఫార్సులలో భాగంగా ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్ పదవికి రాజీనామా చేయాలని, జాతి ఘర్షణలు, ప్రభుత్వ ప్రతిస్పందనపై దర్యాప్తు చేయడానికి సుప్రీం కోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ని ఏర్పాటు చేయాలని డీసీడబ్ల్యూ విజ్ఞప్తి చేసింది. అంతేకాకుండా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అత్యవసరంగా రాష్ట్రాన్ని సందర్శించాలని నివేదికలో పేర్కొంది. షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ) హోదా కోసం మెజారిటీ మైతేయి సామాజిక వర్గం డిమాండ్‌కు వ్యతిరేకంగా కొండ జిల్లాల్లో 'గిరిజన సంఘీభావ యాత్ర' నిర్వహించినప్పుడు మే 3న రాష్ట్రంలో జాతి హింస చెలరేగినప్పటి నుంచి కనీసం 150 మంది మరణించగా, అనేక వందల మంది గాయపడ్డారు.

కులగణనకు పాట్నా హైకోర్టు ఓకే

నితీశ్ ప్రభుత్వానికి ఊరట

పాట్నా: బీహార్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను సవాలు చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్లను పాట్నా హైకోర్టు మంగళవారం కొట్టేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వేను తిరిగి ప్రారంభించేందుకు మార్గం సుగమమైంది. ఈ ఏడాది జనవరిలో నితీశ్ సర్కార్ కులగణనను ప్రారంభించింది. మొదటి దశ సర్వే జనవరి 7-21 తేదీల మధ్య ముగిసింది. రెండో సర్వే ఏప్రిల్ 15న మొదలై మే15తో ముగియాల్సి ఉండగా.. మే 4న పట్నా హైకోర్టు సర్వేపై స్టే విధించింది. కులగణనకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.వినోద్ చంద్రన్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపి వాటిని కొట్టేసింది. అయితే, పాట్నా హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాలు చేస్తామని పిటిషనర్ల తరఫు న్యాయవాది దిను కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని వివిధ కులాల వారి అభ్యున్నతికి పాటుపడేందుకు వీలుగా వారి సామాజిక, ఆర్థిక స్థితిగతుల గురించి సమాచారం తెలుసుకునేందుకు బీహార్‌లో కులగణన చేపట్టనున్నట్లు సీఎం నితీశ్ కుమార్ గతేడాది ప్రకటించారు. రాష్ట్రంలోని 38 జిల్లాల్లో రెండు దశల్లో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని అప్పట్లో ప్రకటించారు.

తగ్గిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను చమురు సంస్థలు సవరించాయి. 19 కిలోల వంట గ్యాస్ సిలిండర్ ధరను రూ.99.75 మేర తగ్గించాయి. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.1,680కు తగ్గింది. గృహ వినియోగ సిలిండర్ ధరలో మాత్రం ఎటువంటి మార్పూ లేదు. కొత్త ధరలు నేటి నుంచి అమలులోకి వచ్చాయి. విమాన ఇంధనం ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలు వరుసగా రెండో సారి పెరిగాయి. దీంతో దేశరాజధాని ఢిల్లీలో ఈ ధర కిలో లీటరుకు రూ.7,728 పెరిగి, రూ.98,508.26కు చేరింది. ఇక ముంబైలో కిలో లీటరు ధర రూ.92,124.13గా ఉంది. దేశీయ చమురు ఉత్పత్తిపై విధించే విండ్‌ఫాల్ పన్నులో మాత్రం ఎటువంటి మార్పు తీసుకురాలేదు. పెట్రోల్, ఏటీఎఫ్‌లపై విండ్‌ఫాల్ పన్నును విధించటం లేదని కేంద్రం తన నోటిఫికేషన్‌లో తెలిపింది.

పన్నులు ఎగవేసే విదేశీ గేమింగ్ ప్లాట్‌ఫారాలపై చర్యలు

ఆర్థిక మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ: పన్నులు చెల్లించడంలో విఫలమైన విదేశీ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లపై చర్యలు తీసుకోవడానికి జీఎస్‌టీ చట్టాలలో తగినన్ని అమలు నిబంధనలు ఉన్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ మంగళవారం తెలిపింది. జులై 11న జీఎస్‌టీ మండలి ఆన్‌లైన్ గేమింగ్ లాటరీపై 28 శాతం పన్ను విధించాలని నిర్ణయించింది. మండలి నిర్ణయం ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లను ఆఫ్‌షోర్ స్థానాలకు మార్చడానికి ప్రేరేపిస్తుందని సంబంధిత వర్గాల నుంచి కొన్ని అభ్యర్థనలు అందాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు తెలిపారు. 'నిర్దేశించిన జీఎస్‌టీ చెల్లించని ఆఫ్‌షోర్ ప్లాట్‌ఫారమ్‌లపై చర్య తీసుకోవడానికి తగిన అమలు నిబంధనలు ఉన్నాయి' అని చౌదరి రాతపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలపై బెట్టింగ్‌ల పూర్తి ముఖ విలువపై 28 శాతం పన్ను విధించాలనే జీఎస్‌టీ మండలి నిర్ణయం ఈ అంశంపై మంత్రుల బృందం (జీవోఎం) సిఫార్సుపై ఆధారపడి ఉంటుంది. వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) విధింపు కోసం సరఫరా విలువను నిర్ణయించే విధానాన్ని నిర్ణయించడానికి మండలి బుధవారం వర్చువల్‌గా సమావేశం కానుంది. ఆన్‌లైన్ గేమింగ్ సరఫరా విలువ ఆటగాడి తరఫున చెల్లించిన, జమ అయిన మొత్తంగా ఉంటుందని ప్రతిపాదించారు. ఆన్‌లైన్ గేమింగ్‌తో పాటు క్యాసినోల విషయంలో టోకెన్‌లు, చిప్స్, నాణేలు లేదా టికెట్ల కొనుగోలు కోసం ఆటగాడు చెల్లించే మొత్తం మొత్తం సరఫరా విలువ అని జీఎస్‌టీ మండలి నిర్ణయించే అవకాశం ఉంది.

కులాలపై ఆరా తీస్తే కఠిన చర్యలు

ఐఐటీ బాంబే మార్గదర్శకాలు జారీ

ముంబై: తోటి విద్యార్థుల కులగోత్రాలను అడగరాదనీ, దాని బదులు ఆటపాటలు, సినిమాలు, సంగీతంలో వారి ఆసక్తి తెలుసుకుని కలసిపోవాలని ఐఐటీ-బాంబే మార్గదర్శకాలు జారీ చేసింది. బీటెక్ మొదటి సంవత్సర విద్యార్థి దర్శన్ సోలంకి ఫిబ్రవరి 12న హాస్టల్ భవనం ఏడో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఐఐటీ-బాంబే క్యాంపస్‌లో కుల వివక్ష ఉందనీ, తన కులం గురించి తెలియగానే తోటి విద్యార్థుల ప్రవర్తనలో మార్పు వచ్చిందని సోలంకి తన తల్లితో ఫోన్‌లో మాట్లాడేటప్పుడు చెప్పినట్లు ముంబై పోలీసులు అభియోగపత్రంలో పేర్కొన్నారు.

అంతర్జాతీయ సవాళ్ల పరిష్కారానికి

ప్రపంచం చూపు భారత్ వైపు: ముర్ము

న్యూఢిల్లీ: క్లిష్టమైన అంతర్జాతీయ సవాళ్ల పరిష్కారానికి భారత్ వైపు ప్రపంచం చూస్తున్నట్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. వాతావరణ మార్పు, సైబర్ భద్రతా, తీవ్రవాదం, ఉగ్రవాదం వంటివి అంతర్జాతీయ సమాజానికి పెద్ద సవాళ్లుగా ఉన్నాయని చెప్పారు. ఆమె మంగళవారం ఐఎఫ్ఎస్ -22 (2022 బ్యాచ్ ఇండియన్ ఫారిన్ సర్వీస్) ప్రొబేషనరీల బృందానికి రాష్ట్రపతి భవన్‌లో ఆతిథ్యమిచ్చారు. వారంతా భారత వైవిధ్యతకు, విదేశీ సేవల్లో లింగ సమతుల్యతకు నిదర్శనమని ముర్ము అన్నారు. మన దేశం మరింతగా రాణించేందుకు అన్ని రంగాల్లో సేవలను విస్తరించేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని యువ దౌత్యవేత్తలకు సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్ పాత్ర, ప్రభావం పెరుగుతున్న క్రమంలో ప్రపంచ వృద్ధి, పరిపాలనకు సారథిగా దేశం ఉందన్నారు. అదే సమయంలో రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక ప్రయోజనాల దృష్ట్యా కొత్త బాధ్యతలు భారత్ భుజాలపై పడ్డాయని అన్నారు. 'కొత్త సవాళ్లతో పాటు అపార అవకాశాలు మీ కోసం ఎదురు చూస్తున్నాయి. మన దేశం వృద్ధి, పురోగతి సాధించమే లక్ష్యంగా పనిచేయండి. కొత్త సాంకేతికలు, విపణులు, వనరుల సరఫరాదారులు, వ్యూహాత్మక భాగస్వాముల అన్వేషణ నిరంతరం సాగించాలి. అందరితో సమన్వయం చేసుకుంటూ ముందుకు దూసుకెళ్లాలి' అని ముర్ము సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 33 మిలియన్ల మంది భారత సంతతి ప్రజలకు అవసరమైన సేవలను అందించాలన్నారు. ఇంటికి దూరంగా మరో ఇల్లుగా భారతీయ దౌత్యకార్యాలయాలు, ప్రవాసీలు ఉంటారని అధికారులు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. కౌన్సులర్ సేవలు విదేశాల్లోని ప్రతి భారతీయునికి అందుబాటులో ఉండేలా చూడాలని యువ దౌత్యాధికారులకు ముర్ము సూచించారు. వందేభారత్ మిషన్, ఆపరేషన్ గంగా, ఆపరేషన్ కావేరి విజయవంతం కావడంలో దౌత్యాధికారుల శ్రమ ఎంతో ఉందని రాష్ట్రపతి అన్నారు. మానవతా సాయంలోనూ భారత్ ముందు ఉండటాన్ని గుర్తుచేశారు. తద్వారా సౌభాతృత్వం పెరుగుతుందని ఆమె అన్నారు.

88 శాతం రూ.2వేల నోట్లు వెనక్కి: ఆర్బీఐ

ముంబై: ఇప్పటివరకు రూ.3.14లక్షలకోట్లు విలువచేసే 88శాతం రూ.2వేల నోట్లు బ్యాంకులకు తిరిగొచ్చినట్లు భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) మంగళవారం తెలిపింది. జులై 31 నాటికి 0.42లక్షకోట్ల విలువ చేసే రూ.2వేల నోట్లు చెలామణిలో ఉన్నట్లు పేర్కొంది. మే 19న పెద్దనోట్ల ఉపసంహరణను ఆర్బీఐ ప్రకటించిన విషయం విదితమే. 87 శాతం నోట్లు బ్యాంకుల్లో డిపాజిట్ల రూపేణ వచ్చాయని వెల్లడించింది. వచ్చే రెండు నెలల సమయాన్ని సద్వినియోగించుకొని రూ.2వేల నోట్లను మార్చుకోవడం లేదా జమ చేయడం వల్ల చివరి నిమిషంలో హడావిడి ఉండబోదని ప్రజలు సూచించింది.

మానవతా సాయానికి అనుమతులివ్వండి

మణిపూర్ సీఎంకు స్టాలిన్ లేఖ

చెన్నై: హింస బాధిత మణిపూర్‌కు మానవతా సాయం అందించేందుకు తమిళనాడు ముందుకొచ్చింది. మందులు, ఇతరత్రాలను పునరావాస కేంద్రాలకు, శిబిరాలకు పంపేందుకు ఈశాన్య రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ అనుమతులు కోరుతూ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ లేఖ రాశారు. శిబిరాల్లో 50వేల మందికి పైగా ఉండటం దృష్ట్యా తమ వంతు సహాయ సహకారాలను బాధితులకు అందిస్తామని తెలిపారు. ఆహారంతో పాటు నిత్యావసరాలను కల్పిస్తామన్నారు. టార్పోలిన్ షీట్లు, దుప్పట్లు, దోమ తెరలు, అత్యవసర మందులు, శానిటరీ నాప్కిన్స్, పాలపొడి తదితర రూ.10కోట్ల విలువ చేసే సహాయక సామాగ్రిని పంపుతామని, అవసరమైతే ఎయిర్ లిఫ్ట్ సేవలనూ అందిస్తామని స్టాలిన్ వెల్లడించారు. తమ వంతు సాయం చేసేందుకు అవసరమైన అనుమతులను కోరుతున్నామని, అవి లభిస్తే ఈశాన్య రాష్ట్ర అధికారులతో తమ అధికారులు సమన్వయం చేసుకుంటారని స్టాలిన్ తెలిపారు. మణిపూర్ క్రీడాకారులకు తమ రాష్ట్రంలో శిక్షణ ఇప్పించేందుకు స్టాలిన్ ముందుకొచ్చిన విషయం తెలిసిందే.

గువాహటి హైకోర్టును తరలించవద్దు

అసోం బార్ అసోసియేషన్

గువాహటి: గువాహటి హైకోర్టును నగరం నడిబొడ్డు నుంచి బ్రహ్మపుత్ర నదికి 23 కి.మీ. దూరంలో ఉన్న ఉత్తర గువాహటిలోని రంగమహల్‌కు మార్చాలని రాష్ట్ర ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాన్ని గువాహటి బార్ అసోసియేషన్ వ్యతిరేకించింది. ప్రతిపాదిత మార్పును ఇతర బార్ అసోసియేషన్లు కూడా వ్యతిరేకిస్తున్నాయని, ఈ ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఆందోళనను ఉధృతం చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని అసోసియేషన్ తెలిపింది. హైకోర్టును ఉత్తర గువాహటిలోని రంగమహల్‌కు తరలిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మే 23న నోటిఫికేషన్ జారీ చేసింది. గువాహటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మృణాల్ కుమార్ చౌదరి మాట్లాడుతూ హైకోర్టును వేరే ప్రాంతానికి మార్చడం వల్ల న్యాయవాదులు, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడతారని అన్నారు. ఇది ఆచరణాత్మక ఆలోచన కాదని, ఈ నిర్ణయం తీసుకునేటప్పుడు క్షేత్ర స్థాయిలో వాస్తవాలను పరిగణలోకి తీసుకోలేదన్నారు.

మణిపూర్ విద్యార్థులతో కలిసి

కర్నాటక మంత్రి జన్మదిన వేడుకలు

చామరాజపేట: కర్నాటక హౌసింగ్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి బి.జెడ్ జమీర్ అహ్మద్ ఖాన్ మంగళవారం తన జన్మదిన వేడుకలను మణిపూర్‌లో జాతి ఘర్షణల కారణంగా ఇక్కడ ఆశ్రయం పొందుతున్న విద్యార్థులతో కలిసి జరుపుకున్నారు. ఖాన్ శాసనసభ నియోజకవర్గమైన చామరాజపేటలోని సెయింట్ థెరిసా విద్యాసంస్థల్లో 29 మంది మణిపూరి బాలికలు ఆశ్రయం పొందుతున్నారని ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. పుట్టిన రోజు జరుపుకుంటున్న మంత్రి వారి విద్య, సంక్షేమం ఖర్చును భరిస్తానని ఈ సందర్భంగా ప్రకటించారు. ఆ విద్యార్థులకు మంత్రి రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటిస్తున్నట్లు తెలిపారు. తమ సొంత రాష్ట్రంలో ప్రమాదకర పరిస్థితులను కారణంగా బెంగళూరు వచ్చామని, తమకు ఆశ్రయం కల్పించిన సెయింట్ థెరిసా విద్యాసంస్థలకు రుణపడి ఉన్నామని విద్యార్థులు చెప్పారు.

జార్ఖండ్ అసెంబ్లీలో బీజేపీ అల్లరి

రాంచీ: జార్ఖండ్ అసెంబ్లీ మంగళవారం ప్రశోత్తరాల సమయంలో.. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయంటూ ప్రతిపక్ష బీజేపీ శాసనసభ్యులు గందరగోళాన్ని సృష్టించారు. సభ ప్రారంభమైన కొద్ది సేపటికే బీజేపీ సభ్యులు రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతపై చర్చ జరగాలని డిమాండు చేస్తూ అందుకు బాధ్యత వహించి ముఖ్యమంత్రి హిమంత్ సోరెన్ రాజీనామా చేయాలని పట్టుబట్టారు. ఈ సందర్భంగా బీజేపీ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. శాసనసభ వ్యవహారాల మంత్రి ఆలంగీర్ ఆలం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి కరవు నివేదికను రెండుసార్లు పంపినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదన్నారు. జార్ఖండ్ ప్రభుత్వం కరవు పీడిత బ్లాకులకు రూ.9,682 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలని కేంద్రాన్ని అర్థించింది. కేంద్రం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి కరవు ప్యాకేజీ అందలేదన్నారు. మంత్రి ప్రకటనతో రెచ్చిపోయిన బీజేపీ సభ్యులు మరింత గందరగోళాన్ని సృష్టించారు. ఈ నేపథ్యంలో సభాపతి రవీంద్రనాథ్ మహతో సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు.

ఇనార్బిట్ మాల్ విశాఖకు ఆణిముత్యం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నగరంలో అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద షాపింగ్ మాల్‌గా రూ.600 కోట్ల వ్యయంతో 15 ఎకరాల విస్తీర్ణంలో రహేజా గ్రూప్ నిర్మిస్తున్న ఇనార్బిట్ మాల్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం ఉదయం భూమి పూజ చేశారు. విశాఖ పోర్టు ట్రస్ట్‌కు చెందిన పోర్టు ఆస్పత్రి సమీపంలో ఉన్న 17 ఎకరాల భూమిని రహేజా గ్రూప్‌నకు 30 ఏళ్ల పాటు లీజుకు రూ.125 కోట్లకు తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో రహేజా గ్రూప్ ప్రగతిని వీడియో ద్వారా తిలకించారు. రహేజా గ్రూప్ చైర్మన్ రజనీష్ మహాజన్, రహేజా గ్రూప్ సీఈవో నీల్ రహేజా తమ సంస్థ ప్రగతిని వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇనార్బిట్ మాల్ విశాఖ నగరానికి ఒక ఆణిముత్యం అని అన్నారు. రానున్న రోజుల్లో విశాఖ రూపు రేఖలు మారిపోతాయని, ఉత్తరాంధ్ర దిశ మార్చేలా అనేక పరిశ్రమలు, ఐటీ సంస్థలు విశాఖలో నెలకొల్పుతున్నామన్నారు. 15 ఎకరాల్లో మాల్ నిర్మాణం జరుగుతుందని, ఇందులో 2 ఎకరాల్లో ఐటీ సెంటర్ నిర్మాణం, ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం జరుగుతాయన్నారు. ఈ మాల్ నిర్మాణంతో విశాఖ నగరం రూపు రేఖలు మారతాయని చెప్పారు. మాల్ నిర్మాణం వలన 8 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ మాల్ దక్షిణాసియాలోనే అతి పెద్ద మాల్ అని చెప్పారు. ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ వలన మరో 3 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

విశాఖ ఆకట్టుకుంటోంది : రహేజా గ్రూప్ ప్రెసిడెంట్ నీల్ రహేజా: ఏపీలో ఇప్పటికే విశాఖ, విజయవాడ, గుంటూరు, రాజమండ్రిలో తమకు స్టోర్లు ఉన్నాయని రహేజా గ్రూప్ ప్రెసిడెంట్ నీల్ రహేజా తెలిపారు. విశాఖలో ఇనార్బిట్ మాల్‌కు శంకుస్థాపన అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో కాకినాడ, నెల్లూరు, తిరుపతిలో ప్రారంభిస్తామన్నారు. తమ సేవలు దేశవ్యాప్తంగా ఐటీ పార్కులు, హోటళ్ల రంగంలో కూడా పాలుపంచుకున్నాయని తెలిపారు. రహేజా గ్రూప్ గత కొన్ని నెలలుగా విశాఖపట్నం సందర్శిస్తోందన్నారు. విశాఖలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధితో ఆకట్టుకుంటోందన్నారు. ఇనార్బిట్ మాల్‌తో పాటు ఐటీ రంగంలో తమ వంతు వ్యాపార సేవలు అందించాలన్న ఆలోచనతో ఉన్నట్లు ఆయన వివరించారు.

వ్యాపారానికి అనుకూలమైన వాతావరణం : ఇనార్బిట్ మాల్ సీఈఓ రజనీష్ మహాజన్: వ్యాపార వృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కల్పించిందని ఇనార్బిట్ మాల్ సీఈఓ రజనీష్ మహాజన్ తెలిపారు. ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికి దూరదృష్టి గల నాయకత్వం అవసరమని, ఏపీ ప్రభుత్వం అందుకు అనుగుణంగా పని చేస్తోందని కొనియడారు. ప్రాజెక్టు అనుమతులను పొందడంలో తమ సంస్థ అనుభవం మినహాయింపు ఏమీ కాదన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్ర ప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచిందనడానికి ఇవాల్టి రోజు నిదర్శనమని అన్నారు.

మొహం చాటేసిన సీఎం...!

విశాఖలో ప్రారంభోత్సవాలకు మీడియాను ఆహ్వానించని అధికారులు

విశాలాంధ్ర-విశాఖ సిటీ: విశాఖలో అనేక అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి నగరానికి మంగళవారం విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మీడియాకు మాత్రం మొహం చాటేశారు. సుమారు రూ.850 కోట్లకు పైగా ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం చేసిన ఆయన ఆ విషయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు మాత్రం ప్రత్యక్ష కార్యక్రమం నిర్వహించకుండా విమర్శలు మూటకట్టుకున్నారు. సాధారణంగా ప్రజాపయోగ కార్యక్రమాలు, ఇతరత్రా అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించేటప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఒక బహిరంగ సభ నిర్వహించి ప్రజా వేదిక ద్వారా ఆయా ప్రారంభోత్సవాలు చేయడం, ప్రజలకు చెప్పాల్సింది నేరుగా చెప్పడం పరిపాటి. గతంలో రాష్ట్రానికి ముఖ్యమంత్రులుగా పని చేసిన వారందరూ కూడా ఈ తరహా విధానాన్ని అవలంభించేవారు. కొన్ని సందర్భాల్లో మాత్రం కొన్ని ప్రాజెక్టులకు సంబంధించి, ఇతరత్రా అధికారుల కీలక సమావేశాలు ఇన్ కెమెరా పేరుతో మీడియాకు అనుమతి లేకుండా నిర్వహించడం కూడా సాధారణంగా జరిగేది. కానీ ఆయా సందర్భాలలో ఆ సమావేశం ముగిసిన తర్వాత ఏదో ఒక కార్యక్రమంలో ఆ పర్యటనలో రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ప్రజలతో మమేకమయ్యేందుకు మీడియాతో సీఎం మాట్లాడేవారు. దీనికి భిన్నంగా మంగళవారం విశాఖపట్నంలో సీఎం వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. అభివృద్ధి కార్యక్రమాలను కూడా తాము తీసిన ఫోటో, తాము చెప్పిందే పత్రికల్లో రాయాలని అనిపించే విధంగా కేవలం జిల్లా సమాచార, ప్రజా సంబంధాల శాఖ ద్వారా పత్రికా ప్రకటన విడుదల చేసి చేతులు దులుపుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సమాచార శాఖ అధికారులు, మరే ఇతర శాఖ అధికారులు సీఎంను తప్పుదోవ పట్టించారో తెలియదు గానీ విశాఖలో జరిగిన కార్యక్రమంలో మాత్రం సీఎంఓ, డీఐపీఆర్ఓ, ఐపాక్ సభ్యులు మాత్రమే భాగమయ్యారన్న ఆరోపణలు వినిపించాయి.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.